ప్రజాశక్తి

Vol. 3, no. 7

(Aug. 18, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 7

(Aug. 18, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0

Regd. No. M. 4486


ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 7

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 18-8-43



తిండిదొంగలకు ప్రజల ప్రతిక్రియ

లాహోరు చూపుతున్న ఆదర్శం

లాహోర్ (పంజాబ్) లో కేంద్రప్రజా ఆహారకమిటీ ఒకటేర్పడింది. తిండిదొంగల పీడ నెదుర్కొని ప్రజలకు ఆహారం అందివ్వడానికి ఈ కమిటీ జరిపిన కృషి, పొందిన ఫలితం ఆదర్శప్రాయం.

ఈ కమిటీకి, దాని అధ్వర్యంకింద ఏర్పడిన పేట కమిటీలకు ఆహార పదార్థాలను కొని ప్రజలకు పంచడానికి వడ్డీ లేకుండా ప్రజలు మొత్తం 20,000 రూపాయలు అప్పు ఇచ్చారు. తిండిదొంగలను బట్టబయలు చేస్తూ కమిటీ జరిపిన ప్రచారానికి ప్రజల్లోనుంచి వచ్చిన ప్రతిఫల మిది.

రాకరాక ధాన్యం మార్కెట్టుకు రావడం ప్రారంభమయింది. రైతులు తమ స్టాకును అమ్మడం మొదలెట్టారు. కాని, ఈధాన్యాన్నంతనూ తిండిదొంగలు కొనేసి, ప్రజలకు గింజలు దొరక్కుండా చేయడం ప్రారంభించారు. ఆసమయంలో కేంద్ర ఆహారకమిటీ రంగంలోకి వచ్చింది. తిండిదొంగలను దుయ్యబట్టింది. విరాళాలతోనో, లేక అప్పులతోనో ఆహార నిధిని వసూలుచేసి ధాన్యం కొనవలసిందని ప్రజలకు సందేశం ఇచ్చింది — ప్రజలకోసం ధాన్యం నిలవచేయాలనికూడా హెచ్చరించింది. చిత్తశుద్ధిగల వర్తకులు ధాన్యం కొని, న్యాయమయిన లాభానికి ప్రజలకు అమ్మేలా చేయాలని ప్రజలకు సలహా యిచ్చింది. ఈప్రచార ఫలితంగా పై అప్పు దొరికింది.

అటుతరువాత, కేంద్రకమిటీ అధ్యక్షుల నాయకత్వంతో జిల్లా మేజిస్ట్రేటు దగ్గరకు డెప్యుటేషను తీసుకువెళ్ళారు.

వెళ్ళి —

ఆహారకమిటీల స్వాధీనంలో ఉన్న స్టాకుల్ని పబ్లిక్ స్టాకులుగా ఎంచి, నిలవ వ్యాపారుల్ని అణచడానికి తీస్తుకున్న చర్యలు ఈస్టాకులికి వర్తించకుండా చేయాలనీ:

ఆహారకమిటీలతో వర్తకులు చేసుకున్న ఒడంబడికలను ప్రభుత్వం ఆచరణలో పెట్టించాలనీ, ఇలాంటి ఒడంబడికలను ఆచరణలో పెట్టని వర్తకుల స్టాకుల్ని ప్రభుత్వం తీసుకొని ప్రజలకు పంచాలనీ ;

ఆహారకమిటీలు తమ స్టాకుల్ని రవాణా చేసుకోడానికి కావలసిన సౌకర్యాలన్నిటినీ ప్రభుత్వం కలిగించాలనీ;

మేజిస్ట్రేటుదగ్గరనుంచి హామీలు కోరారు. ఆహారసమస్యయొక్క విషమస్థితిని అనుభవం మీద తెలుసుకున్న మేజిస్ట్రేటు వెంటనే ఈ హామీ ఇచ్చాడు.

ఈ హామీ తీసుకొని కేంద్రకమిటీ కిసాన్ సభను కలుసుకొని రైతులు ధాన్యాన్ని ఆహార కమిటీలకే అమ్మేలా చేయాలని కోరింది. 'రైతులు తప్పకుండా మీకే అమ్ముతార'ని కిసాన్‌సభవాగ్దానం చేసింది.

ఈ సౌకర్యాల నన్నిటినీ సాధించి కేంద్ర కమిటీ తనకృషిని ఇంకా తీవ్రపరిచింది. రోజుకొక పేటకమిటీ కొత్తగా ఏర్పడుతూంది. వాలంటీర్ల శిక్షణ శిబిరం తీవ్రంగా పనిచేస్తూంది.

అన్నిటికన్నా మించిం దేమంటే—అసలు నిలువవ్యాపారం లేకుండాచేయడానికి, రేషన్ పద్ధతి అమలు చేయడానికి ప్లానువేస్తున్నారు.

దానితో తిండిదొంగ పనిఅయిపోయినట్టే.

సుభాసొక ముసుగు ★

దానివెనుక నున్న దేమిటి?

అక్షరాజ్యాల తీపిమాటలకు నేనెప్పుడూ విలువనివ్వలేదు. వాళ్ళు మనదేశంలోకి వస్తే మనకు విముక్తికలిగించేవారుగారారు. మనల్ని కొల్లగొట్టడానికే వస్తారు. కాబట్టి, సుభాస్ బోసు విధానాన్ని నేనంగీకరించడం కల్ల.

— మహాత్మాగాంధి
1942, జూన్

చాలసంవత్సరాల కిందటే సుబాస్‌బోసు మార్గం, మా మార్గం వేరయిపోయాయి. అతని మార్గాన్ని నేనంగీకరించను సరికదా, దానిని ప్రతిఘటిస్తాను. బయటనుంచి ఏ సేన వచ్చినా, అది జపానుచేతిలో కీలుబొమ్మగానే వస్తుంది. మన దేశంలోని సేనలు వీటి నెదుర్కొంటాయి; మనం గెరిల్లా పద్ధతులను అవలంబించాలి.

— జవహర్లాల్
1942, ఏప్రిల్

జపానుకుగాని, జర్మనీకిగాని బానిసలమవాలనేకోర్కె మనకులేదు. మనల్ని బానిసలుగా చేయాలనుకునే ఏదేశాన్నైనాసరే ప్రతిఘటిస్తాం.

ఇతర దేశాలకు, మన దేశానికీ స్వాతంత్ర్యం యివ్వడంకోసం యుద్ధం చేస్తున్నామని జర్మనీ, జపానులంటున్నాయి. ఆమాటలను నమ్మకూడదు. మనం సంఘటితంగా వుంటే జపాను, జర్మనీలకు భయపడవలసిన అవసరంలేదు— మనలో ఒక్కరక్తపుబొట్టు మిగిలి ఉన్నంతవరకు వాళ్ళను ప్రతిఘటించి, మన దేశగౌరవాన్ని కాపాడుకుంటాం.

— జవ్హార్‌లాల్
1942, జూన్.

జపాను వచ్చి మనకు స్వాతంత్ర్యం యిస్తుందని ఆశించడం చవట బానిసతత్వమే. మనం జపానువాళ్ళ నాహ్వానించాలని ఏభారతీయుడయినా అంటే, అతనిది వట్టి బానిస తత్వ మంటాను — యజమానులు మారడం గురించే అతను ఆలోచించగలడు. కాని, తన స్వాతంత్ర్యంగురించి ఆలోచించలేడు.

బ్రిటనుతో మనకు తగాదా ఉన్నంతమాత్రంచేత మనం జపానునుగాని, మరే ఇతర దురాక్రమణదారుల్నిగాని ఆహ్వానించకూడదు.

— మౌలానా అజాద్
1942, ఏప్రిల్.

సామ్రాజ్యవాదులు - పాశ్చాత్యులు కానీయండి, ఆసియావారే కానీయండి ఎలాంటివారో గత శతాబ్దంలో మనకు బాగాతెలిసింది. సమయం వచ్చినప్పుడు టోజో సహాయం అవసరంలేకుండానే మనం స్వాతంత్ర్యం సంపాదిస్తాం. జపాను ఇండియాపై దండెత్తదని ఇటీవల టోజో అన్నమాటలు హాస్యాస్పదాలు. అతనిసానుభూతి మనకక్కరలేదు.

— గఫర్‌ఖాన్
1942 జూన్

బ్రిటిష్ ప్రభుత్వం మనల్నేంచేస్తుంది, మనం దాన్నేంచేస్తున్నాం అనేదికాదు ముఖ్యంగా ఆలోచించవలసింది. అసలు విషయం మనదేశాన్నెదుర్కొంటున్న ప్రమాదం దాన్ని గురించి మనం ఏంచెయ్యాలిఅన్నది. కాబట్టి, ఇంతవరకు ఏంజరిగినా, ఇప్పుడు ఇండియాలో బ్రిటన్ యుద్ధకృషికి అమెరికా మిత్రుల సన్నాహాలకు భంగం కలిగించం. ఉత్పత్తి తీవ్రంగా సాగాలని మా కోరిక.

— జవహర్లాల్
1942 ఏప్రిల్

కాంగ్రెసువాదులకు సరోజినీదేవి హెచ్చరిక

కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యురాలు సరోజినీదేవి 6-8-43 న ఇలా ప్రకటించింది:

" మహాత్మజీని, వర్కింగుకమిటీసభ్యుల్ని అరెస్టుచేయగానే కాంగ్రెసు వాదుల్లో నానా గందరగోళం బయలుదేరింది. ఒక నిశ్చితమైన కార్యక్రమం లేకపోవడంవల్ల, ముఖ్య నాయకులు బయట లేకపోవడంవల్ల ఇలా జరిగింది.

ఒక విషయం నేను స్పష్టంచేయ దలచుకున్నాను. కాంగ్రెసులో ఏవ్యక్తికిగాని, గ్రూపుకుగాని కాంగ్రెసు పేరుతో ప్రణాళికను ప్రచురించడానికి, కొత్త విధానాలను నిర్ణయించడానికి కాంగ్రెసు వర్కింగు కమిటీగాని, అఖిల భారత కాంగ్రెసు కమిటీగాని ఏలాంటి అధికారం ఇవ్వలేదు.

కాంగ్రెసు ముఖ్యసూత్రాలకు, సంప్రదాయాలకు పూర్తి వ్యతిరేకమైన రహస్య కార్యక్రమాన్ని సూచిస్తూ, వీటిని కొనసాగించడానికి కాంగ్రెసు అధికార సంస్థలు తమకు అధికారమిచ్చాయనికొందరంటున్నారు. ఇలాంటిదేమీ జరగలేదు.

ఇదే సమయంలో కాంగ్రెసు నిబంధనావళిని సవరించడానికిగాని, దాని నిర్ణయాలను మార్చడానికిగాని ఏసభ్యునికి అధికారంలేదు.

అయినప్పటికీ కాంగ్రెసు అధికార కార్యక్రమాన్ని కొనసాగిస్తూ దేశసేవ చేయడం మనందరి కర్తవ్యం.

ఈనాడు "ఆకలి, అబ్బా - ఆకలి" అని కోటానుకోట్ల సోదర దేశీయులు ఆక్రోశిస్తున్నారు. ఆ పిలుపును మనం పెడచెవిని పెట్టలేము. వీరి ఆకలిమంటలు తీర్చడానికి కృషి చేయడమే ఈనాడు మనందరి ప్రప్రథమకర్తవ్యం. ఈ సమస్య నెదుర్కోవడంలో వివిధ విభేదాలు అంతరించిపోవడం నేను సంతోషంతో గమనిస్తూన్నాను. మనస్ఫూర్తిగా ప్రజలకు సేవచేయడంలోనే సుస్థిరమైన ఐకమత్యం ఏర్పడగలదు.

"ఆకలితో అలమటిస్తున్నవాడికి భగవంతుడయినాసరే పట్టెడన్నంరూపంలోనే ప్రత్యక్షం కాగలడు. కాని, మరోవిధంగా రాలేడు,"

అని మహాత్ముడొకసారన్నాడు.

బుధవారం ప్రజాశక్తి 18-8-43

బట్టల కంట్రోలు ఆర్డరులో తొల్టులు

యుద్ధకాలాని కంతటికీ యింతవరకు ఇండియాప్రభుత్వం వేసిన సమగ్రమైన ప్లాను ఒకే ఒకటి. అది జూన్ 16 వ తేదీన ప్రకటించబడిన ప్రభుత్వ బట్టల కంట్రోలు స్కీము. దీనికి వ్యతిరేకంగా బట్టల ఖరీదును 4—5 రెట్లు పెంచి, విపరీతమైన లాభాలు పొందుతున్న మిల్లుయజమానులు, బట్టలవ్యాపారస్థులు ధ్వజం ఎత్తారు. వీలయినంతవరకు యీస్కీమును వ్యతిరేకించారు. ప్రభుత్వం బట్టల పరిశ్రమనే స్వాధీనంచేసుకొంటానని బెదిరించాక దిగివచ్చారు. నామకః వీరు స్కీముకు అంగీకారం తెలుపుతూ, ఆచరణలో ఆటంకాలు, అభ్యంతరాలు కల్పించుతూవచ్చారు.

బట్టలమిల్లు యజమానులు ఉత్పత్తిని వృద్ధిచేయడానికి సాయపడటంలేదు సరిగదా, అనేకవిధాల కుంటుపరచడానికి ప్రయత్నించుతున్నారు. కార్మికుల కిచ్చిన హెచ్చుఖరీదుల అలవెన్సులను తెగకోయడానికి బొంబాయి ఛాంబర్ ఆఫ్ కామర్సు కుట్ర పన్నింది. ఎలక్ట్రిసిటీ కొరత అనే పేరుతో ఉత్పత్తిని తగ్గించడానికి ప్రయత్నించారు. ఈవిధంగా కార్మికులను రెచ్చగొట్టడానికి పూనుకొన్నారు. కాని, కార్మికులు దేశభక్తితోయీపన్నాగాలను ఎదుర్కొన్నారు. బొంబాయిలోని 52మిల్లుల కార్మికులు విద్యుచ్ఛక్తి ఖర్చును తగ్గించడానికి గ్రూపుల ప్రకారం సెలవు తీసుకుంటామని ప్రభుత్వానికి, యజమానులకు తెలియజేశారు. ఇలాంటి నోటీసులపై సంతకాలుచేసిన కార్మికులను పనినుండి తొలగించుతామని మిల్లు యజమానులు బెదిరించారు. కాని, కార్మికులు జంకలేదు. దేశప్రజలందరికి, దేశరక్షణ చేస్తున్న సైన్యాలకు, ముఖ్యావసరాలలో ఒకటయిన బట్టలను అధికంగా ఉత్పత్తిచేయడానికి పూనుకొన్నారు. తమ సంఘ సమిష్టిబలంతో యజమానుల కుట్రను ఓడించి, అధికోత్పత్తి చేస్తున్నారు.

తరువాత మిల్లు యజమానులు, బట్టలవర్తకులు కంట్రోలు బోర్డులో స్థానాలన్నిటినీ ఆక్రమించారు. మొత్తం 25 సీట్లలోనూ 15 స్థానాలు మిల్లు యజమానులకు, 5 సీట్లు బట్టలవర్తకులకు, 2 దూదివర్తకులకు వెళ్లాయి. కార్మికులకు ఒకేఒక స్థానం. బట్టలు కొనే 40 కోట్లప్రజలకు ఒకస్థానమైనా యివ్వలేదు. బట్టల కంట్రోలు స్కీమునులోపలనుంచి యీ విధంగా నిరుపయోగం చేయడానికిపూనుకొన్నారు. ఇదివరకే ఖరీదులు తగ్గుముఖం బట్టాయి కాబట్టి ధరల కంట్రోలు అవసరంలేదని ప్రచారం చేశారు. అధిక లాభాలకోసం సరుకును దాచిన గుత్తవ్యాపారస్థుల సాయంతో నిలవ సరుకునుఅమ్మే గడువును పొడిగించాలని ప్రచారంచేశారు.

కాని, పైప్రయత్నాలలో ప్రజలు, కార్మికులు చూపినదేశభక్తి వలన విఫలులయ్యారు. ఇతరమార్గాల యీ స్కీమును నిరుపయోగం చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి, కొంతవరకు జయంపొందారు. ఆగష్టు 6 వ తేదీన ఇండియా ప్రభుత్వం 1. అల్లిక దుస్తులకు (బనియన్లు, మేజోళ్ళు వగైరా) 2. రెడీమేడ్ దుస్తులకు (ధోవతులు—చీరలు మినహాయించి) 3. కుట్టుదారంకు 4. ఊపు, తాళ్ళు వగయిరాలకు బట్టల కంట్రోలు ఆర్డరు వర్తించదని ప్రకటించింది. ఆగష్టు 9 వతేదీ ప్రకటనలో చేతిమగ్గాలపై తయారయ్యే బట్టను కూడ కంట్రోలు ఆర్డరునుండి మినహాయించింది. దీనివలన అపుడే ఖరీదులు మరల హెచ్చుదల చూపాయి కూడా.

ఈ మినహాయింపులు బట్టల కంట్రోలుస్కీముకు గొడ్డలిపెట్టువంటివి. తయారయిన వస్తువులకు (రెడీమేడ్) కంట్రోలు లేదంటే, సరుకును దాచిన గుత్తవ్యాపారస్తులు వెంటనే తానులు చింపి, రెడీమేడ్ దుస్తులుగా కుట్టించుతారు. హెచ్చుఖరీదులకు అమ్మి ప్రజలను దోచుకుంటారు.

చేతిమగ్గాలపై తయారయిన బట్టలకు కంట్రోల్ లేదంటే, వానినే నిల్వ చేసి గుత్తవ్యాపారస్థులు అధికలాభాలు పొందుతారు. బీదప్రజలు హెచ్చుగా వాడేవి నేత బట్టలు కాబట్టి వారిని దోచుకుంటారు. అందులోనూ 1942 లో మొత్తం మిల్లులపై 400 కోట్ల గజాల బట్ట తయారయితే, చేతిమగ్గాలపై 180 కోట్ల గజాలు తయారయింది. స్కీమునుంచి $\frac{1}{3}$ వంతు బట్టను మినహాయించడమంటే, ఎంత తొర్ర మిగల్చడమో చూడండి. ప్రభుత్వం, కంట్రోలుబోర్డు చేనేత పనివారికి రక్షణయివ్వడానికే యిలాచేశామని వాదించవచ్చును. కాని, చేనేత పనివారికి రక్షణ యివ్వడానికి యిది మార్గం కానేకాదు. నూలు ధరలను కంట్రోలుచేసి చౌకగా చేమగ్గాలకు సప్లయిచేసి, చేనేత కార్మికులకు న్యాయమైన కూలి గ్యారంటీ చేయాలి. కంట్రోలు ఆర్డర్‌నుంచి చేనేత బట్టలను మినహాయించడంవల్ల చేనేత పనివారికి రక్షణయివ్వడంలేదు. పైగా గుత్తవ్యాపారస్థులకు సరుకు దాయడానికి, అధికలాభాలకు అమ్ముకోవడానికి అవకాశమిస్తోంది.

అందుచే ప్రజ లందరూ ఈ సవరణలకు వ్యతిరేకంగా ఆందోళన చేయాలి. పైన సూచించినట్లుగా చేనేత పనివారికి న్యాయమైన కూలీ గ్యారంటీ చేయాలని కోరాలి. చేనేత పనివారు తమ పేరు వినియోగించి మిల్లు యజమానులు, షాహుకారులు, ప్రజ లందరికీ ముఖ్యావసరాలలో ఒకటయిన బట్టలను అందజేసే కంట్రోలు స్కీమును నిరుపయోగం చేయడానికి చేస్తున్న కుట్రను గుర్తించాలి. ప్రజ లందరి సహకారంతోనే వారి హక్కులు రక్షించబడుతాయి; రెడీమేడ్ దుస్తులను కూడా స్కీములో చేర్చితీరాలని దేశభక్తులు, ప్రజాసంస్థలు తీవ్రమయిన ఆందోళన చేయాలి. అపుడే వర్తకులు, మిల్లుయజమానులు చేసే కుట్రను ఓడించగల్గుతాము. అప్పుడే ప్రజలందరికి సరసమైన ధరలకు బట్టలు అందునట్లు చేయగల్గుతాము.

మన రాజకీయాలు

★ ఆగస్టు 9 ని పంచమాంగదళపు కుట్రలు భగ్నమయాయి

— కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ

ఆగస్టు 9 వచ్చింది. వెళ్లింది. పంచమాంగదళం దేశభక్తుల్నీ, ప్రజల్నీ మళ్లీ రెచ్చగొట్టి, విధ్వంసక చర్యలకు పురిగొల్పాలని చేసిన కుట్ర పూర్తిగా భగ్నమయింది. దేశభక్తులు-ప్రజలు శాంతియుతంగా ప్రభుత్వ నిర్బంధవిధానానికి నిరసన మాత్రం తెలియజేశారు. దేశరక్షణకు హానికలిగించే విధ్వంసక చర్యలలో పాల్గొనలేదు. "ఆజాద్ హిందుస్థాన్" రేడియో (జపాన్ సామ్రాజ్యవాదులది) 9 వ తేదీలోగా ప్రతి ఆంగ్లేయుణ్ణి చంపవలసిందని యిచ్చిన హెచ్చరిక పరిహాసాస్పదమయింది.

పంచమాంగదళపు కుట్ర

క్రిందటి సంవత్సరంవలె ఈ యేడుకూడా ఆగస్టు 9 వ తేదీని విధ్వంసక చర్యలు చేయమని హెచ్చరించడంవల్ల ప్రజలుగుడ్డిగా తమను అనుసరించరనే అర్థం పంచమాంగదళానికి చెందిన కాంగ్రెసు సోషలిస్టుములాకు తెలుసు! కనుకనే ఈ యేడు వారు ప్లేటు మార్చారు. కాంగ్రెసుసంస్థపేరుతో సత్యాగ్రహయాత్ర అనీ, దేశవ్యాపితహర్తాళ్ అనీ, మూడు రోజుల విద్యార్థిసమ్మె అనీ, నూలువడకడం అనీ, ఆగస్టు 9 కి కార్యక్రమం యిచ్చారు. ఆదేసమయంలో అచ్యుత పట్వర్ధన్ - జయ ప్రకాశనారాయణలు (కాంగ్రెసు సోషలిస్టుపార్టీ) బొంబాయి కార్మికుల్ని "తిరుగుబాటు" చేయమని రెచ్చగొడుతూఒక కరపత్రం ప్రకటించారు. అందులో అహింసను గురించి ఒక్కమాటకూడా లేదు. ఇంతేకాదు. "విప్లవకారుల సమ్మేళనం" అనే పేరుతోమరో కరపత్రం వచ్చింది. గత "పోరాటం"లో కాంగ్రెసు సోషలిస్టులు గావించిన నిర్మాణ కృషిని ప్రశంసిస్తూ, ఆకరపత్రం యిలా హెచ్చరించింది: "మనం యింకా చక్కని నిర్మాణ పద్ధతులతోను, ప్లానుతోను, క్రమశిక్షణతోను, విధ్వంసక కార్యక్రమాన్ని కొనసాగించాలి"

మన ఆంధ్రరాష్ట్రంలో కూడా జపాన్ ఏజంట్లు "రణగర్జన" వంటి కరపత్రాల ద్వారా రైలుపట్టాలు, టెలిగ్రాఫ్ తీగలు పీకమనీ, పెట్రోల్‌బంకులు, ప్రభుత్వపు టాస్థులు ధ్వంసంచేయమనీ, నినాదమిచ్చారు.

ప్రజల యెదురు దాడి

పంచమాంగదళం యీవిధంగా ప్రజల్ని మరొక ఆగస్టు 9 కి రెచ్చగొట్టాలని విశ్వప్రయత్నం చేసింది. కాని, యీ దేశద్రోహుల కుట్రలను ప్రజలు భగ్నం చేశారు.

ఆంధ్రదేశంలో, విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, రాజమండ్రి, బందరు, మొదలైనచోట్ల విద్యార్థులలో అఖిలభారత విద్యార్థిసంఘ కార్యకర్తమాన్ని గురించి తెలియజేస్తూ, సమ్మెలుచేయడం ఎలా పంచమాంగదళ కుట్రలకు గురికావడమో నచ్చజెప్పడంవల్ల 9 వ తేదీన ఆ కేంద్రాలలో విద్యార్థు లెవరూ సమ్మె చేయలేదు. నెల్లూరులో విద్యార్థిసంఘ వర్కర్లు కాలేజీ గేట్ల వద్ద నిలబడి శాంతిని కాపాడుతుంటే, "పోరాట" వాదులు కొందరు లోపలికి పోయిన విద్యార్థుల్ని తంతామని బెదిరించారు; రాళ్ళు రువ్వారు; కొందరిపై సిరా కొట్టారు; కాని, పోలీసులు రావడంచూచి, పారిపోయారు: ఇట్టి "పోరాట" వాదులు విద్యార్థి సామాన్యంలో పూర్తిగా బట్టబయలయ్యారు. నెల్లూరులో కాలేజీ విద్యార్థులు 100 కి 90 మంది, హైస్కూలు విద్యార్థులు 100 కి 70 మంది, క్లాసులకు వెళ్ళారు. ఈ విధంగా సమ్మె విఫలమయేసరికి సమ్మెదారులుకూడా సాయంత్రం స్కూలుకువెళ్ళారు. బెజవాడ కాలేజీలోను, గుంటూరుహిందూకాలేజీలోసగం మాత్రం సమ్మెలు చేశారు.

కార్మికుల దేశభక్తి

రైల్వేకార్మికులు ప్రజలకు ఆహారపదార్థాలను రవాణాచేయడం, సైనికులకు యుద్ధపరికరాలనందజేయడం, తమ బాధ్యత అని తెలుసుకొని సమ్మెలు చేయకుండా ఉత్పత్తిపంథాను పూర్తిగా ఆచరణలో పెట్టారు. విశాఖపట్నం హార్బరు కార్మికులలోను, జూట్‌మిల్లు కార్మికులలోను కమ్యూనిస్టుల్ని ప్రభుత్వం అరెస్టు చేస్తుందని అప్పటివరకూ భయపెట్టజూచిన ఆపర్చ్యూనిస్టులు9 వ తేదీని కమ్యూనిస్టులుగవర్నమెంటు ఏజంట్లని దూషించసాగారు. వీరి బూటకత్వాన్ని కార్మికులు సులభంగా అర్థం చేసుకొని తమ పార్టీ నాయకత్వంక్రింద శాంతియుతంగా ఉత్పత్తిని కొనసాగించారు. తూర్పుగోదావరిజిల్లా, రామచంద్రపురం తాలూకాలో ఫార్వర్డు బ్లాకువారు కొందరు, వ్యవసాయ కూలీలను దోపిళ్ళకు రెచ్చగొట్టారు. కాని, స్థానికకమ్యూనిస్టుపార్టీ సభ్యులతో సంప్రతించిన మీదట వ్యవసాయకూలీ లెవ్వరూ ఆ పన్నాగంలో పడలేదు. రాజమండ్రిలో పోలీసులు ఒక కార్మికుని అరెస్టుచేసి కొట్టడంవల్ల యితర బళ్ళకార్మికుల్ని సమ్మెకు రెచ్చగొట్టడానికి పంచమాంగదళానికి మంచి అవకాశం దొరికింది. కాని, స్థానిక పార్టీసభ్యుల కృషిఫలితంగా సమ్మె జరగలేదు.

ఇతర రంగాల్లో

రైతులలోను, మధ్యతరగతి ప్రజలలోను, కాంగ్రెసువాదులలోను, కమ్యూనిస్టులు పంచమాంగదళాన్ని గురించి, వారిపన్నాగాన్ని గురించి, విరివిగా ప్రచారం చేయడం వల్ల విధ్వంసక చర్యలు ఎక్కడా జరగలేదు. జపాన్ ఏజంట్ల దుష్కార్యాలనుండి ప్రజల్ని రక్షించే నిమిత్తం, కమ్యూనిస్టులు కొన్నిస్థలాలలో టెలిగ్రాఫ్ తీగలవద్ద, రైలుపట్టాల వద్ద కాపలా కాచారు. (ఉదా : ఈడ్పుగల్లు, ఉప్పలూరు, బొడ్డపాడు, పొద్దుటూరు.) కామ్రేడ్సు యీవిధంగా దేశరక్షణకు తమ యావచ్ఛక్తినీ వినియోగిస్తూంటే, పోలీసులు నర్సారావుపేటలో అకారణంగా ఇద్దరు కమ్యూనిస్టుల్ని, బాపట్లలోముగ్గురినీ ఎరస్టుచేసి విడుదలచేశారు. వినుకొండలో 6 గురినీ, పాలకొల్లులో 3 రినీ, ఎరస్టుచేసి సబ్ జైలులో ఉంచారు.

కొన్నిచోట్ల "పోరాట" వాదులు 9 వ తేదీనాటికి ప్రజలలో (మిగతా 7 వ పేజీలో)

738
17976

బాలసంఘాల నిర్మాణం

మైలవరం: యం. వెంకటేశ్వరరావుగారి అధ్యక్షతను బాలసంఘ సభ్యుల సమావేశం జరిగింది. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన బాలుడు తాను "మందుకోసంవెళ్లి ఒకడాక్టరు గారికి బాలసంఘఆశయాలను తెలియపరచాననీ, డాక్టరుగారు తమఅబ్బాయిని కూడా చేర్పుకోమన్నారని." చెప్పాడు. డాక్టరుగారికి బాలసంఘ ఆశయాలు చెప్పడంవల్ల ఆలస్య మయిందని చెప్పాడు. ఇతనిలాగా బాల సంఘసభ్యులందరూ పనిచేస్తే, త్వరలో బాల సంఘాలు వృద్ధిపొందుతాయి

పటమట: (బెజవాడ తాలూకా) జులై 31 న 50 మంది బాలబాలికలతో బాలసంఘం ఏర్పడింది. గండికోటేశ్వరరావును అధ్యక్షుని గాను, యలమంచిలి రాజారావును కార్యదర్శి గాను ఎన్నుకొన్నారు.

మంగళాపురం: (దివితాలూకా) 72 మంది బాలబాలికలు కామ్రేడ్ చంద్ర రామలింగయ్యగారిఅధ్యక్షతను సమావేశమై. బాలసంఘానికి చంద్ర వెంకటకృష్ణయ్యను అధ్యక్షునిగాను, చంద్ర వెంకటసుబ్బయ్యను కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు. ఇలాగే చిర్లపాలెంలో కూడ 40 మంది బాలబాలికలతో సమావేశం జరిగింది. 36 గురు సంఘంలో చేరారు. నూకలవారిపాలెంలో 40 మంది బాలబాలికలు సమావేశమై. కొందరు సంఘంలో చేరారు.

ప్రొద్దుటూరు:(కృష్ణాజిల్లా) 60 మందితో బాలసంఘం ఏర్పడింది. బొట్టు పూర్ణచంద్రా రెడ్డిని అధ్యక్షునిగాను, భీమవరపు కుళంద రెడ్డిని కార్యదర్శిగాను ఎన్నుకున్నారు.

రాజమండ్రి: ఇన్నీసుపేట బాల బాలికలు టి. వి. రత్నాలు అధ్యక్షతను సమావేశమై బాలసంఘాశయాలను నిర్వర్తించెదమని ప్రతినబూనారు. రాజమండ్రి బాలసంఘ ఆర్గనైజరుగా పందిరి రాజును, జి. చంద్రరావును అధ్యక్షునిగాను, వెంకటరమణ — సత్యవతులను కార్యదర్శులుగాను ఎన్నుకున్నారు. బాలబాలికలు ఆటపాటలు నేర్చుకొనుచున్న పార్టీ ఆఫీసుపైన జండా తెల్లబడిపోయింది. అదిచూచి మంచి జండా ఎగురవెయ్యండని రాజు, సుహాసిని 2-0-0 మురళి 0-1-0 విరాళం ఇచ్చారు.

కప్పలదొడ్డి: (పెదన) బాలసంఘం రాయలసీమ నిధికి రు 3-13-0 లు వసూలు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా అప్పారావుపేట బాలసంఘ సభ్యులిద్దరు తలా ఒక 0-2-0 రాయలసీమ నిధికి దవ్విచ్చారు.

మా విధి

బాలవీరులము - మేము
భావిపౌరులము
ఆడుతాం
పాడుతాం
ఆరోగ్యాన్ని పొందుతాం బాల॥
చెడుమార్గమునబోము - బడికి
శ్రద్ధగపోతాము
చదువుతాం
చర్చిస్తాం
విజ్ఞానాన్ని పొందుతాం బాల॥
భేదమేలేదు - మాలో - మేము
- వారు వీరనము
ఏకమై
సాగుతాం
స్వతంత్రాన్ని సాధిస్తాం బాల॥

— పీసా లక్ష్మణరావు

నిర్బంధాలు శిక్షలు

నర్సాపురం తాలూకా కమ్యూనిస్టుకమిటీ ఆర్గనైజరు కామ్రేడ్ పూర్ణచంద్రరావు, కామ్రేడ్ సాయి వెంకట్రామయ్య, కామ్రేడ్ కాజేశ్రీపల్లి సుబ్బారావు, పాలకొల్లులో 6 వ తేదీరాత్రి అరెస్టుచేయబడి నర్సాపురం సబ్ జైలులో నిర్బంధించ బడ్డారు.

జులై 31 వ తేదీని ప. గోదావరిజిల్లా కమ్యూనిస్టు కమిటీ తరపున కామ్రేడ్సు వి. పట్టాభిరామారావు, వి. హనుమంతరావు, కె. రాములుగారలు జిల్లాకలెక్టరు వద్దకువెళ్లి 9 వ తేదీని విధ్వంసక చర్యలు జరగకుండా ప్రచారం చేయుటకై వీధి మూలల సభలు జరుపుకోడానికి అనుమతికోరగా కలెక్టరు నిరాకరించాడు.

నైజాం సంస్థానంలో, సూర్యాపేటతాలూకా నల్లగొండజిల్లాలో ఆంధ్రమహాసభకార్యకర్తలైన కామ్రేడ్స్ డి. సుబ్బారావు, ఎ. తిరుమలరావు, డి. రాఘవేంద్రరావు, డి. కస్తూరి రంగారావుగారలు వేషాలు, బుర్రకథలద్వారా ఫాసిస్టు వ్యతిరేక ప్రచారంచేస్తూ, ప్రజల నిత్యజీవితసమస్యలపై ఉపన్యాసాలిస్తూంటే పోలీసులు అరెస్టుచేసి కేసుపెట్టారు. 28-7-43 వ తేదీనిపై కామ్రేడ్సుకు ఒక్కొక్క నెల విడిఖైదు విధించుతూ తీర్పుచెప్పబడింది.

మహిళా సంఘానికి విరాళాలు

6—7—43 తేదీన బెజవాడలో జిల్లా మహిళాసంఘ ఆఫీసులో మానికొండ సూర్యావతిగారి అధ్యక్షతను మహిళా సమావేశం జరిగింది. మహిళాసంఘానికి, అంటె, వర్కర్సును పోషించటానికి, మహిళాసంఘ ఖర్చులకు, మహిళాసంఘం తరపున క్యాంపు పెట్టడానికి చందా వసూలుచేయాలి; వీటికొరకు కార్యనిర్వాహక సభ్యులే ముందంజవేయాలి అనగా ఈక్రిందివిధంగా వర్కింగు కమిటీ సభ్యులు, యితరులు విరాళాలు ఇచ్చారు.

మాలెంపాటి శారదాంబగారు	బంగారపు గాజు 1
వి. అన్నపూర్ణమ్మగారు	100—0—0 బంగారపు గాజు 1
కాట్రగడ్డ హనుమాయమ్మగారు	100—0—0 బంగారపు గాజు 1
కామినేని శ్రీకృష్ణగారు	50—0—0
యలమంచిలి కమలగారు	20—0—0
గవిర్నేని వసుమతిగారు	వెండిగ్లాసు, బంగారపు ఉంగరం
మానికొండ సూర్యావతిగారు	వెండిగ్లాసు
మల్లవరపు అనసూయగారు	వెండిగ్లాసు మంగళసూత్రం
జోస్యభట్ల సుబ్బమ్మగారు	వెండిగ్లాసు

వి. అన్నపూర్ణాదేవి
జిల్లా మహిళాసంఘ సెక్రటరీ.

★

రాయలసీమకు పేదల సహాయం

రేపల్లెతాలూకా, పొన్నపల్లి గ్రామంలో 1—8—43 వ తేదీని కామ్రేడ్ వై. వి. సుబ్బారావు రాయలసీమ కరువునిధిని వసూలుచేస్తూ, కారె విచ్చిరెడ్డి అనే ఒక పేదరైతువద్దకు వెళ్ళాడు. రాయలసీమ ప్రజల యిక్కట్లు చెప్పి, సహాయం చేయమని అడిగాడు. అతడు తన వద్ద యేమీ లేకపోవుటచే, తెల్లబోయి చూస్తూ వుండగా, ప్రేమతో తాను పెంచుచున్న కోడి కనపడింది. వెంటనే దాన్ని సంతోషంతో ఇచ్చివేశాడు. ఆపెట్టను ముత్తుపల్లిలో వేలంవేయగా రు. 4 వచ్చింది.

ఇలాగే, గుడివాడతాలూకా వెన్ననపూడి గ్రామంలో 5—8—43 వ తేదీని కామ్రేడ్ సుంకర లక్ష్మీనారాయణ రాయలసీమ నిధి వసూలుచేస్తూంటే, సూరపనేని నారయ్య అనే 90 సంవత్సరాల వృద్ధపేదరైతు తన పైమీది పంచను తీసి యిచ్చాడు. కుట్టుమిషనువల్ల జీవనం పోషించుకుంటూన్న అట్లూరి వీరమ్మ అనే స్త్రీ 1 చీర, యితరబట్టలు మొత్తం 10 శాల్తీలు రాయలసీమ కరువుబాధితులకిచ్చింది.

★

రాయలసీమకు వైద్య సహాయం

వ్యాధులచే ఘోరంగా పీడింపబడుచున్న తోటి రాయలసీమ వాసుల స్వాస్థ్యమును చక్కబెట్టుటకుగాను ఆంధ్రాయుర్వేద వైద్య మండలివారు "ధన్వంతరి సేవాదళము"నే పేరుతో కొంతమంది ప్రజాసేవాభిలాషులగు వైద్యులను పంపనిశ్చయించినారు. కాన మానవసేవయే వరమావధిగా పెట్టుకున్న వైద్యులీదళములో చేరరావలెనని ప్రార్థించుచున్నాను. ఏతెంచే వైద్యులకు సంచారపు ఖర్చులు, భోజనఖర్చులు యిచ్చెదరు. గాన ఆంధ్రరాష్ట్రములోని వైద్య వరులు యీ మహత్తర సేవాకార్యక్రమమునకురావలెనని కోరుచున్నాను. రాగోరే వైద్యులు యీ 25 వ తారీఖులోగా డా॥ ప్రకాశచంద్రశతపథి, కేరాఫ్ కార్యదర్శి, ఆంధ్రవైద్యమండలి,ఏలూరునకు తెలియపర్చవలెను. అటుపిమ్మట వచ్చు దరఖాస్తులు అంగీకరించబడవు.

డా॥ ప్రకాశచంద్రశతపథి,
ధన్వంతరివైద్యదళాధిపతి

మరొక దేశభక్తుని హెచ్చరింపు

ది 9-8-42 న కాంగ్రెస్ నాయకులను ప్రభుత్వం అరెస్టుచేసి, కాంగ్రెస్ మీదదాడి ప్రారంభించిన తోడనే ప్రజలుకోపోద్రిక్తులై నందున అరాచక చర్యలు జరిగాయి. తర్వాత జైలునుండి గాంధీజీ లేఖలువెలువడ్డ తర్వాత యిది కాంగ్రెస్ కార్యక్రమం కాదని తెలుసుకొన్నారు. అరాచక చర్యలు నిల్చిపోయినవి. కాంగ్రెస్‌వారు జపాను ఏజంట్లనే ప్రభుత్వ వాదం నిరర్థకమైపోయినది. గనుక ప్రతిదేశభక్తుని తక్షణకర్తవ్యం అరాచక చర్యలు జరగకుండా చూచుటయే. కాంగ్రెసు ప్రతిష్ఠ, మహాత్మునికీర్తి, ప్రపంచంలో ఋజువుచేయవలెనంటె అరాచక చర్యలు జరగకుండా శాంతిని నెలకొల్పాలి. ఈ న్యాయమైన కార్యక్రమంవల్లనే సామ్రాజ్యవాదుల దుష్ప్రచారాన్ని క్షీణింపచేయగలము.

మిరియాల గోవిందశెట్టి,
టౌన్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసభ్యుడు.
నాయుడుగూడెం.

వైజ్ఞానిక ప్రచారం

కామ్రేడ్ చిలుకూరి సుబ్బారావు (నర్సాపురం తాలూకా రైతుసంఘ కార్యదర్శి) జులై 30 మొదలు ఆగస్టు 3 వ తేదీ వరకు కొడమంచిలి, వేమవరం, ఆచంట గ్రామాలలో "ప్రజాయుద్ధం" అనే బుర్రకథ ద్వారా సుమారు 1400 మంది ప్రజలలో రైతుసంఘాల ఆవశ్యకతను గురించి, జాతీయైక్యతను గురించి ప్రచారంచేశారు.

రాయలసీమ 'డే' (1-8-43) నాడు పెదపాలపర్రు (కృష్ణా) గ్రామంలో కామ్రేడ్ కోగంటి గోపాలకృష్ణయ్య రాయలసీమ కరువును గురించి సోదిచెప్పి, పేదస్త్రీలలో రాజకీయ ప్రచారంచేసి, రాయలసీమ కరువు నివారణకు మొత్తం 2½ కుంచాల బియ్యం, 15 బట్టలు, వసూలు చేశారు.

నెల్లూరు తాలూకా రైతుసంఘం తరపున యీనెల 6,7 తేదీలలో కామ్రేడ్ రాజగోపాల్, రామచంద్రయ్య, రాఘవయ్యగారలు "చైనాగెరిల్లాల యుద్ధం" మొదలైన బుర్రకథలద్వారా కొరుటూరు, పొగతదొర్వు, కంద్రికల గ్రామాలలో ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం గావించారు.

మండపేట (తూర్పుగోదావరి) గ్రామంలో కయ్యూరు కామ్రేడ్సు మెమోరియల్ దళంవారు 10-8-43 వతేదీన "దేశభక్తులు" అనే నాటకం,కోయవేషం, గొల్లసుద్దులు మొదలైన వేషాలు, ప్రదర్శించి, 1500 మంది ప్రజలలో, ఫాసిస్టువ్యతిరేక ప్రచారం గావించారు.

ఈనెల 2 వ తేదీని జరిగిన కోవూరు తాలూకా (నెల్లూరుజిల్లా) కమ్యూనిస్టు సమావేశ సందర్భంలో రాత్రి సుమారు 4 గంటలసేపు బుర్రకథ, వేషాలు,సమిష్టిగానం మొదలైన వైజ్ఞానికకార్యక్రమంద్వారా 1000 మంది ప్రజలలో రాజకీయ ప్రబోధం చేశారు.

ఈనెల 3, 4 తేదీలలో కైకలూరు తాలూకా (కృష్ణా) కమ్యూనిస్టు సమావేశం జరిగిన సందర్భాన 4 వ తేదీ సాయంకాలం అక్క — చెల్లి, గెరిల్లా, పడవపాట మొదలయిన వైజ్ఞానిక ప్రదర్శనలు అగ్రాసప్రజలను బిరివిగా ఆకర్షించాయి.

కామ్రేడ్ పుల్లయ్యకు జోహారులు

కామ్రేడ్ కంభంపాటి పుల్లయ్య గంపలగూడెం యువజన సభ్యుడు. బాలసంఘఆర్గనైజరుగాపనిచేసేవాడు. ఆంధ్రరాష్ట్రకమ్యూనిస్టు మహాసభకు, డబ్బులేక గంపల గూడెం నుండి బెజవాడకు 55 మైళ్ళునడచివచ్చాడు, ఆమహాసభసందర్భంలోబాలబాలికలపాటలను విని ఉత్సాహంతో, బాలసంఘంలో పనిచేయ సాగాడు. 20-7-43 నుండి టైఫాయిడ్ జ్వరంతోబాధపడ్డాడు, కొందరు యువజనులు చూడడానికి వెళ్లితే, ఎఱ్ఱజండా కోసం పలవరించాడు. జండాఇస్తే కళ్లకద్దుకొని ఏడ్వసాగాడు. ఆతర్వాత స్మారకమే లేకుండా పోయింది. 2-8-43 న చనిపోయాడు.

యువకులు, బాలబాలికలు, కుట్టుపనివారు ఊరేగింపు జరిపి కామ్రేడ్ పుల్లయ్యను సమాధిచేశారు. సమాధిపై ఎర్రజండాను పాతారు. చనిపోతూకూడా ఎఱ్ఱజండానుమరువని కామ్రేడ్! నీకిదే మా జోహారులు.

కలరా నివారణకు కార్మికుల కృషి

బెజవాడలో కొత్తపేట, లబ్బీపేటల్లో కలరా బయలుదేరింది. వెంటనే మునిసిపల్ కార్మికులు దీనినివారణకు నడుం బిగించారు. ఈమధ్య 6 గురు కుట్టుపనివారు, మునిసిపల్ పనివారు కలిసి కొత్తపేటకువెళ్లి వీధులన్నీ శుభ్రంచేసి, అక్కడి ప్రజలకు కలరా నివారణోపాయాలను బోధించారు. లబ్బీపేటలో కలరావల్ల మొన్న 5 వ తేదీనాటికి ముగ్గురు చనిపోయారు: ఇది తెలిసి ఇంచిపేటనుంచి 15 మంది మునిసిపల్ పనివారు ఫినాయిల్ మొదలయిన వాటితో అక్కడికి వెళ్లి మురికి ప్రదేశాలను శుభ్రంచేసి, ఇళ్ళచుట్టు ఫినాయిల్ చల్లారు. తరువాత అక్కడ సభ జరిపి అందరూ కలరాసూదిమందులు తీసుకోవాలనీ, కుళ్లినపదార్థాలు తినకూడదనీ, వేడిపదార్థాలే తినాలనీ, కార్మికులు బోధించారు తరువాత రెండు చోట్లవీధిమూల మీటింగులుపెట్టి మరి కొంత ప్రచారం చేశారు. దీనివల్ల కలరా ప్రమాదాన్నెదుర్కొగలమనేధైర్యం అక్కడి ప్రజల్లోకలిగింది.

కాకినాడ కార్మికుల ఆందోళన

కాకినాడ మునిసిపల్ పనివాళ్లకు0-8-0 కరువు భత్యం ఇస్తున్నందుకు సంతోషం తెలుపుతూ, ఇకమీదట ప్రభుత్వోద్యోగులతో పాటు మునిసిపల్ పనివారికి, ఉద్యోగులకు కూడా 8-8-0 అలవెన్సు ఇప్పించాలని మునిసిపల్ వర్కర్సు యూనియన్ జనరల్ బాడీ సమావేశం తీర్మానించింది.

ప్రస్తుతం మునిపల్ పనివారికి పనిభారం ఎక్కువగా వుందనీ, నిరుద్యోగులుగా పడివున్నవారికి పని కలిగించి, వీళ్లభారం తగ్గించాలనీ తీర్మానించారు. పట్టణ ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యతను తాము వహిస్తామని ఈకృషిలో అధికారులకు, పనివారికి ఎక్కువ సహకారంవుండాలనీ తీర్మానించారు.

కాకినాడ చుట్టల పనివారు జనరల్‌బాడీ సమావేశంలో కొట్టు కమిటీ లేర్పాటు చేయాలని తీర్మానించారు.

కొత్తపొగాకు చట్టంవల్ల పొగాకుపనివారిలో నిరుద్యోగం ఎక్కువ వుతూందనీ, కాబట్టి ఈ చట్టాన్నిమార్చి నిరుద్యోగం తొలగించాలనీ కోరారు.

★

చిట్టివలస జూట్ కార్మికుల ఘోష

యుద్ధావసరాల పేరుతో ఉత్పత్తికే దెబ్బ

చిట్టివలస జూట్ మిల్లులలో 3176మంది కార్మికులు యుద్ధావసరాలకు కోట్లకొలది గోనెసంచులు, గోనెపట్టాలు తయారు చేస్తున్నారు. అధికారులు లక్షలకొలది లాభాలు తీసుకొంటున్నారు. కాని వారు మాత్రం కడుపు చేతపుచ్చుకుని నకనకలాడిపోతున్నారు.

మిల్లు యజమానులు ఒక్కొక్క కార్మికునికి నెలకు 18 శేర్ల బియ్యం మాత్రమే యిస్తారు. ఈనెల అదికూడ యింతవరకు యివ్వలేదు. మేము తీసిన లెక్కల ప్రకారం ఒక్కొక్క కుటుంబంలో సగటున 6 గురు ఉన్నారు. రోజుకు మనిషికి అర్ధశేరు బియ్యం చొప్పున నెలకు ఒక్కొక్క కుటుంబానికి 90 శేర్లయినాగావాలి. ఇందులో 18 శేర్లు ఏమోవంతు? మిల్లుబయట సప్లయి చాల తక్కువ. వారానికి కుటుంబానికి అర్ధశేరు బియ్యం యిస్తున్నారు. అనేక మంది ఉలవలు, కందులు వగైరా ఉడకబెట్టి తిని జీవితం గడుపుతున్నారు. దాదాపు 4 యిండ్లకొక జబ్బుమనిషైనా ఉన్నాడు. కార్మికులంతా బట్టలు కొనుక్కోలేక యింటిదగ్గర గోచీలతోనే కాలక్షేపం చేస్తున్నారు.

మూలిగే నక్కపైన తాటిపండులాగ మిల్లులో ఫినిషింగు డిపార్టుమెంటులో పనిచేసే 500 మంది కార్మికులకు రోజుకు 10 గంటల్లో 5 గం॥ పనిమాత్రమే దొరుకుతూంది. మిగతా 5 గం॥ కూలి దొరకదు. యుద్ధావసరాలకు గోనెపట్టాలు తయారుచేసి వాటికి ఫినిషింగు అవసరంలేకుండానే పంపిస్తారు. అందువలన వీరికిపనితగ్గింది. లేదా మిల్లు యజమానులు యింకొక పనికి వీని వినియోగించుకుంటే వీరు అధికోత్పత్తికి ఎంతైనా తోడ్పడగలరు. కాని అధికారులు కదలడంలేదు. ప్రభుత్వం ఉపేక్ష వహించి ఊరుకుంది.

పరిస్థితు లిదేవిధంగా కొనసాగితే చిట్టివలస కార్మికులు కొద్దిరోజుల్లోనే యింకా భయంకర పరిస్థితులకు గురిఅయి, దేశరక్షణ మరచిపోయి పంచమాంగదళం వలలో పడిపోవచ్చు. రాబోయే ప్రమాదాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

ఈ పరిస్థితుల్లోనే యూనియన్ అధ్యక్షుడు యీ సంగతేమీ పట్టించుకోకుండ యూనియన్‌లో కులతత్వాన్ని పురిగొల్పి నాయకత్వపు తగాదాలతో కాలక్షేపం చేయడం కార్మికుల యెడల ఘోరమైనఅపచారం.

వై. విజయకుమార్,
కార్యదర్శి.
చిట్టివలస కాంగ్రెసు లేబరుయూనియన్,
తగరపువలస.

బర్మా కాందిశీకుల సమస్య

ప్రభుత్వానికి సూచన

3-8-43 వ తేదీని అనకాపల్లిలో (విశాఖపట్నంజిల్లా) తాలూకా బర్మాకాందిశీకుల సంఘం సమావేశమై, ప్రభుత్వానికి యీ క్రింది సూచనయిచ్చింది.

కాందిశీకుల సహాయం కొరకు ప్రారంభింపబడిన రిలీఫ్ పనులు (రోడ్లు వేయించడం వగైరా) వర్షాలవల్ల కొట్టుకుపోయి విశేష నష్టం కలుగుతోంది. అందువల్ల, ప్రస్తుతం అధ్వాన్నస్థితిలో ఉన్న ఎస్టేటు చెర్వులు, కాలవలు, మరమ్మతు చేయించడంలోనూ, వెదుళ్లగడ్డ ప్రాజెక్టును నిర్మించడంలోను, ప్రభుత్వం శ్రద్ధతీసుకుంటే, యిటు కాందిశీకులకు సహాయమూ జరుగుతుంది; అటు పంటల అధికోత్పత్తికి అవకాశమూ లభిస్తుంది.

ఆహారసమస్య

తిండిదొంగలను పట్టుకుంటే రౌడీలు విరుచుకుపడ్డారు

ఈసంఘటన నెల్లూరుజిల్లా వెంకటగిరిలో జరిగింది. వెంకటగిరి జనాభా 16 వేలు. వీరు, చుట్టుపక్కల పల్లెలవారు నెల్లూరు నుంచి బియ్యం తెప్పించుకోవలసిందే. నెల్లూరునుంచి వెంకటగిరికి వస్తున్న బియ్యం తిండిదొంగల చేతుల్లో పడుతూంది. అందువల్ల నగరంలోని బీదప్రజలు గింజలు లేక మలమలమాడుతున్నారు.

కడపజిల్లానుంచి దొంగవ్యాపారులు వచ్చి దగ్గరున్న పల్లెల్లో మకాం వేసి యీబియ్యం ఎక్కువధరలకు కొనేసి చల్లచల్లగా కడపకు చేరవేస్తున్నారు. ఈవిధంగా ప్రతి రోజూ కొన్నివందల మూటలు ఎగుమతి అయిపోతున్నాయి. ఇదంతా బాగా తెలిసికూడా పోలీసులు, సివిక్‌గార్డులు ఊరుకుంటున్నారు.

దీని నరికట్టడానికి కమ్యూనిస్టులు, ప్రజావాలంటీర్లు ఊళ్ళోని ప్రజల కందరకు ఈ వ్యాపారాన్ని వెల్లడిచేశారు. దొంగతనంగా బియ్యం అమ్మేవారికి, కొనేవారికికూడా హితబోధ చేశారు. అయినా ఈదుర్మార్గులు తమ వ్యాపారాన్ని మానకపోవడంవల్ల, మొన్న 10 వ తేదీని తిండి దొంగలను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్ళ ప్రయత్నించారు. ఇంతలో జమీందారు నౌకర్లు మానవ సమాజానికే తలవంపులు తెచ్చేలా తిట్టుకుంటూ ఈ ప్రజాసేవకులపైని విరుచుకుపడ్డారు. వాళ్ళ కేలాంటి జోక్యం లేకపోయినా ఈరౌడీలు యిలా చెలరేగారు.

ఈ గూండాల దౌర్జన్యానికి తలయొగ్గి ప్రజలు ఆకలిమంటల్లో మలమల మాడవలసిందేనా? ఇలాంటి పరిస్థితుల్ని ప్రభుత్వం వెంటనే అరికట్టాలి. కడపకు బియ్యంచేరడం మంచిదే. కాని, అది దొంగవ్యాపారులద్వారా చేరితే అక్కడ కరువుబాధలు తీరకపోవడం అటుంచి, వెంకటగిరిలో తీవ్రమౌతుంది.

చిత్తూరు జిల్లాలో వర్తకుల సహకారం

వెంకటగిరిలో వర్తకుల వైఖరి యిలా ఉంటే, చిత్తూరుజిల్లా చంబకూరులో వర్తకులు ప్రజలకు సాయం చేస్తున్నారు. చంబకూరు ఫిర్కా ప్రజలు మొన్న 9 వ తేదీని చంబకూరులో ఆహార మహాసభ జరిపారు. దేశరక్షణకు, ఆహారసమస్యకు గల సంబంధాన్ని పలువురు ప్రముఖులు విశదపరిచారు. ఈ సమావేశంలో 15 మంది సభ్యులు గల ఆహారకమిటీ ఎన్నుకోబడింది. వర్తకులు, ముస్లింలు, బజారు రేటుకంటె 4 రూపాయలు తక్కువధరకు 300 బస్తాలధాన్యం ఈకమిటీ కిచ్చారు. చౌకంగడి పెట్టి ఇవి బీదప్రజలకు అందజేయడానికి యేర్పాటులు జరుగుతున్నాయి.

కాకినాడలో ప్రజాందోళన

గవర్నమెంటుకీ షాహుకార్లకీ మధ్య జరిగిన నిర్ణయంప్రకారం బజారులో బియ్యం రు 21-8-0 లకే అమ్మకుండా కాకినాడలో ఎక్కువమంది షాహుకార్లు అధికధరలకు అమ్ముతున్నారు. దీనిపై 18 వ వార్డులో ఏర్పడిన ఆహారకమిటీ తీవ్రమైన ఆందోళన జరుపుతోంది. అంతేకాకుండా ఈ బియ్యం ధరను యింకా తగ్గించాలని, సరుకు అందరికీ అందేటట్లు రేషన్‌కార్డు పద్ధతిని ప్రవేశపెట్టాలని సిటీ కమ్యూనిస్టు కమిటీ, పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిలు ప్రజలలో ప్రచారం చేస్తున్నాయి. వార్డులలో ఆహారకమిటీలు పెట్టి పైకోర్కెలు నెరవేర్చేటట్లు చేయుటకు తీవ్రకృషి జరుగుతోంది.

సారస్వత సభ

బెజవాడ పట్టణ అభ్యుదయ రచయితల సంఘాధ్వర్యాన ఈ నెల 8 వ తేదీని రామమోహన లైబ్రరీ హాలులో బహిరంగసభ జరిగింది. శ్రీ నిడదవోలు వెంకటరావుగారు అధ్యక్షతవహించారు.

పాటిబండ మాధవశర్మగారు ఉపన్యసిస్తూ మన తెలుగు సాహిత్యంలో నన్నయ నుంచి ఇప్పటివరకు ఆయాదశల్లో మార్పుస్పష్టంగా కనిపిస్తూందన్నారు.

కళల్లోకల్లా ప్రశస్తమైనది సాహిత్యం; సమాజాన్ని ఉన్నత మార్గాలకు తీసుకువెళ్లేదే నిజమైన సాహిత్య మని వీరన్నారు.

"కవి ఎందుకు రాస్తాడు అని అడుగుతే, కోకి లెందుకుపాడుతుంది?" అని ఎదురు ప్రశ్నతో జవాబిస్తారు కొందరు. ఈసామ్యమే నిజమయితే కోకిల పాటలాగా, కవిపాట కూడా అర్థంలేని కూతేనా? అనిఅడిగారు శర్మగారు

సాహిత్యంద్వారా ఎంతో సాధించగలమనీ, పరిస్థితుల్ని అర్థం చేసుకొన్న కవే ఉత్కృష్ట కావ్యాల్ని సృష్టించగలుగుతాడని చెప్పారు.

శ్రీ తాపీ ధర్మారావుగా రుపన్యసిస్తూ మన సారస్వత చరిత్రను పరిశీలిస్తే ప్రతికాలంలోను అభ్యుదయ పోకడలు కనుపిస్తాయన్నారు. అభ్యుదయం మానవ స్వభావం. పూర్వ కవి [illegible] ధనవంతులమీద నాధారపడేవాడు. అందువల్ల ప్రజాసాహిత్యం సృష్టి కావడానికి అవకాశం లేకపోయింది. కందుకూరు వీరేశలింగంతో ప్రజాసాహిత్యం ఉత్పత్తి అవడం ప్రారంభించింది. వీరేశలింగంగారు తెలుగు భాషకు చేసిన సేవ అమోఘము.

పూర్వ పోకడల్లోని లోట్లను సవరించుకుంటూ అభ్యుదయ రచయితలు నిర్భయంగా ముందుకు సాగిపోవాలని ఉద్బోధించారు.

తరువాత శ్రీయుతులు వేలూరి సహజానంద, చదలవాడ పిచ్చయ్యగార్లు ఉపన్యసించారు. సమాజాన్నెదుర్కొనే తీవ్ర సమస్యల్ని పరిష్కరించడానికి దారిచూపుతూ అభివృద్ధి కలిగించడమే అభ్యుదయరచయితల ఆశయం అని పిచ్చయ్యగారు తెల్పారు.

సవరణలు

"చాటపర్రు మహిళా సభకు 300 మంది వచ్చారు"ని గతవారం ప్రకటించబడింది. సభకు వచ్చినది 30 మంది, 300 కాదు.

* * *

"జ్వాల" పుస్తక పరిచయంలో "[illegible]నును కాట్లకుక్కవలె కరవాలంటాడు" అని వ్రాశాము. రచయిత ఉద్దేశ్యం జపానే కాట్లకుక్కవలె కరవడానికి సిద్ధంగా ఉంది, అని. ఈపొరపాటుకు చింతిల్లుచున్నాం.

సంపాదకుడు

మన జాతీయ వాంఛకు ప్రపంచ ప్రజల అండ

పసిఫిక్ దేశాల సమావేశంలో జరిగిన చర్చల సారాంశం

[రష్యాపై హిట్లరు దాడి ప్రారంభమయాక, ప్రపంచానికి స్వేచ్ఛాజీవితమా? లేక ఫాసిస్టు దాస్యమా? అనే సమస్య అన్నిదేశాల ప్రజల్నీ యెదుర్కొంది. ప్రపంచ ప్రజలు ఫాసిస్టు సామ్రాజ్యవాదాన్ని నాశనం చేయడంలోనే తమ స్వాతంత్ర్యం యిమిడి ఉందని గ్రహించి, నేటి భీషణ సంగ్రామంలో పోల్గొంటున్నారు. అయితే — ఇండియావంటి పరాధీన దేశాలలో ప్రజాసామాన్యం ఉత్సాహంతో ముందుకొచ్చి, రమతో సమానంగా పోరు సల్పలేకపోతున్నారనీ, ఇది ఫాసిస్టు ప్రతికూల సంఘటనలో ఒక పెద్ద బీట అనీ, వారు గ్రహించారు. ఈబీటను పూడ్చడానికి ఎన్నోప్రయత్నాలు చేస్తున్నారు. నిరుడు డిసెంబరు 4 మొదలు 14 వ తేదీవరకు క్విబెక్ (కెనడా)లో జరిగిన పసిఫిక్ సమావేశం అట్టి ప్రయత్నాలలో ఒకటి. ఆసమావేశంలో జరిగిన చర్చల సారాంశాన్ని యీక్రిందివ్యాసంలో యిస్తున్నాం— సం.]

రెండు ప్రధాన సమస్యల్ని పరిష్కరించడానికి పసిఫిక్ సమావేశం జరిగింది: (1) యుద్ధాన్ని యిప్పటికంటె చక్కగా నిర్వహించడానికీ, వివిధ మానవజాతుల మధ్య రాజకీయంగాను, ఆర్థికంగాను న్యాయపద్ధతుల్ని స్థాపించడానికీ, మిత్రరాజ్యాలు (ముఖ్యంగా పసిఫిక్ దేశాలు) సమిష్టిగా ఏయేచర్యలు తీసుకోవాలి? (2) ఈ సమావేశంలో జరిగే చర్చల ఆధారంపై మిత్రరాజ్యాలు యుద్ధ సమయంలోను, యుద్ధానంతరం, యెట్టి కార్యక్రమాన్ననుసరించి పని చేయాలి?

సమావేశానికి అమెరికా, బ్రిటన్, ఇండియా, చైనా, అధినివేశ రాజ్యాలనుండి, ఇంకా ఇతర మిత్రరాజ్యాలనుండిప్రతినిధులు హాజరయారు. మనదేశాన్నుండిసర్ ఎ. రామస్వామి మొదలియార్, సర్‌మహమ్మద్ జఫరుల్లా, రావుబహదూర్ మెహర్‌చంద్ ఖన్నా, బీగం షానవాజ్, కె.ఎం. పణిక్కర్, సర్ ఎస్. ఇ. రంగనాధన్, రావుబహదూర్ శివరాజ్, ప్రతినిధులుగా వెళ్ళారు.

అట్లాంటిక్ ఛార్టర్

ప్రారంభదశలో అట్లాంటిక్ ఛార్టరును గురించి చర్చ జరిగింది. (1941, ఆగస్టు 14 వ తేదీని బ్రిటిష్ ప్రభుత్వం తరఫున చర్చిల్, అమెరికన్ ప్రభుత్వం తరఫున రూజువెల్టు, అట్లాంటిక్ సముద్రంలో ఒక చోట సమావేశమై, యుద్ధానంతరం ప్రపంచ భావిగతిని గూర్చి ఎనిమిది సూత్రాలను అంగీకరిస్తూ చేసుకున్న ఒడంబడిక, యిది). ప్రపంచాని కంతకూ యీ ఛార్టరు వర్తింపుతుందనే విషయంలో యిప్పుడున్న అనుమానాలన్నింటినీ తొలగించడం అవసరమని అధికసంఖ్యాకులు తెలియజేశారు. ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించడంలో యిదే మొట్టమొదట జరగవలసినపని అని వారు వాదించారు. సమావేశం ప్రారంభమైనప్పటినుంచి అగాయక ఈ విషయమే ప్రధానమైన చర్చనీయాంశంగా పరిణమించింది. బ్రిటిష్ ప్రధాని యిచ్చిన అనేక ఉపన్యాసాలు ఇతర దేశాలలో అనుమానాలకు కారణం అయాయి. అట్లాంటిక్ ఛార్టర్‌లో పేర్కొన్న ఎనిమిది సూత్రాలు దూరప్రాచ్యదేశాలకు కూడా (ఇండియా, చైనా మొదలైనవి) వర్తింపుతాయా? లేక ఒక్క యూరపుఖండానికేనా? అనే సందేహం చర్చిల్ ఉపన్యాసాలవల్ల ఏర్పడిందని చాలామంది ప్రతినిధులు తెలియజేశారు. అమెరికన్ ప్రభుత్వం, అమెరికన్ ప్రజలు, యీ ఛార్టర్‌లోని మొదటి 5 సూత్రాల యెడల మాత్రమే ఉత్సాహం చూపుతున్నారనీ, చివరి 3 సూత్రాల యెడల ఎక్కువ ఉత్సాహం చూపడం లేదనీ, బ్రిటన్‌లో ప్రజాభిప్రాయం ఆందోళన పడుతూన్నట్లు కొందరు బ్రిటిష్ ప్రభుత్వపక్ష ప్రతినిధులు ఆరోపించారు.

ఛార్టరులోని సూత్రాలు

అట్లాంటిక్ ఛార్టర్‌లోని మొదటి ఐదుసూత్రాలు యివి:

1. ఇతరదేశాల ఆక్రమణ పనికిరాదు.
2. ప్రజల యిష్టంలేకుండా దేశ సరిహద్దుల్ని మార్చకూడదు.
3. యుద్ధానంతరం ప్రతి దేశంలోను ప్రజలు తమకిష్టంవచ్చిన ప్రభుత్వాన్నే స్థాపించుకోవచ్చు.
4. ప్రతిదేశం ఆర్థికంగా వృద్ధిచెందడానికి తగినంత సహాయం చెయ్యాలి.
5. అన్నిదేశాల ప్రజలకు ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత, ఉన్నతమైన జీవిత పరిమాణం లభించడానికి అన్యోన్య సహకారం కొరకు కృషి చేయాలి.

ఇక, చివరి మూడుసూత్రాలు యివి:

6. నాజీహంతకులు నాశనమయిన తరువాత, ఆ యా దేశ సరిహద్దులలో స్వేచ్ఛతో గూడిన శాంతిని స్థాపించాలి.
7. అన్నిసముద్రాలమీద రాకపోకలకు, వ్యాపారమార్గాలకు, ఎట్టిఆటంకాలు లేకుండా చూడాలి.
8. అన్నిదేశాలలోను ఆయుధవిసర్జనను ప్రోత్సహించి, దురాక్రమణ యికసాగకుండా జాగ్రత్తపడాలి.

మొదటి 5 సూత్రాల విషయంలో అమెరికన్లు ఎక్కువఉత్సాహాన్ని చూపుతున్నారట! కాని, చివరి 3 టి విషయంలో అంత ఉత్సాహాన్ని కనపరచడం లేదట! దీని అర్థం యేమిటి? యుద్ధానంతరం ఇండియావంటి వలస దేశాలకు కూడా స్వేచ్ఛాప్రతిపత్తిని అంగీకరించాలని అమెరికన్లు ఒత్తిడి చేస్తున్నారు. కాన్ఫరెన్సుకు వచ్చిన కొందరు బ్రిటిషుప్రభుత్వ ప్రతినిధుల కిది గిట్టలేదు. అందువల్ల, చివరి 3 సూత్రాల విషయంలో అమెరికన్లు శ్రద్ధచూపడంలేదని ఆరోపించారు. నిజానికి యీ ఆరోపణ ఆధార రహితం. ఎందువల్లనంటే, ప్రపంచంలో యిక ముందు దురాక్రమణసాధ్యం కాకుండా చేయడానికే అమెరికన్లు మొదటి 5 సూత్రాల విషయంలో పట్టుదలగా ఉన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధుల కిది రుచించకపోవచ్చు. అది వేరే విషయం!

గుండ్రబల్ల చర్చలు

ప్రారంభోపన్యాసాలు పూర్తిఅయాక, ఒకొక్కక్క ప్రాంతానికి సంబంధించిన ప్రతినిధులు వేరువేరుగా సమావేశమై ఆయా ప్రాంతాల సమస్యలపై గుండ్రబల్ల చర్చలు సాగించారు. భారత దేశాన్ని గురించి యీ క్రింది చర్చలు జరిగాయి. యుద్ధ నిర్వహణకు, యుద్ధ పరికరాల సప్లయికి, మన భారత దేశం ముఖ్యకేంద్రంగా ఉండి, చైనా ప్రజల కెంతైనా సహాయం చేయగలదని ఒక చైనా ప్రతినిధి ఉపన్యసించాడు. పసిఫిక్ దేశాలకు ప్రత్యేకంగా ఒక యుద్ధ నిర్వహణ కేంద్రాన్ని (పసిఫిక్ వార్ కౌన్సిల్) స్థాపించడం మంచిదని ఒక భారత దేశ ప్రతినిధి సూచించాడు. కెనడా ప్రతినిధులు, అమెరికన్ ప్రతినిధులు, యిందు కంగీకరించారు. జపాన్‌ను ఊపిరాడకుండా చేయగలిగినది కేవలం బ్రిటిష్ దళాలు, అమెరికన్ దళాలు మాత్రమే కాదనీ, పసిఫిక్ దేశాల ప్రజలుకూడా ఉన్నారని, వారు ఉత్సాహంతో వాదించారు.

ఇండియానుగూర్చిదుష్ప్రచారం

కాని, ఇండియానుండి వెళ్ళిన ప్రభుత్వ ప్రతినిధులు ఫాసిజాన్ని నాశనంచేయడం కంటె తమ యజమానులకు ఊడిగం చేయడమే ప్రధానంగా ఎంచారు. యుద్ధానికి భారతీయులు విరివిగా సహాయం చేయలేకపోవడానికి కారణం కాంగ్రెసుయొక్క సహాయ నిరాకరణ పాలసీయట! గాంధీజీ మిత్రరాజ్యాలకు సహాయం చేస్తాడని ఆశించడం నిష్ప్రయోజనమట! బ్రిటిష్‌వారు మొదట ఇండియాను విడిచి వెళ్ళిపోవాలని గాంధీజీ ఆశయమట! మహమ్మదీయులలో ఎక్కువమంది పాకిస్థాన్ విషయమై పట్టుదలగా ఉన్నారనీ, కాని మిగతా ప్రజలు ఈ "విభజన" ను వ్యతిరేకిస్తున్నారనీ, కాబట్టి ఇతర దేశాల మధ్యవర్తులు యీ ప్రతిష్టంభనను అంతమొందించ ప్రయత్నిస్తే దేశానికి మహోపద్రవం తప్పదనీ, యీ భారతదేశ ప్రతినిధి వాదించాడు.

అతుకులబొంత

ఒక అతుకులబొంతను యీ సామ్రాజ్యవాదబంటు సూచించాడు. అమెరికన్ ప్రతినిధులు, కెనడా ప్రతినిధులు, దీన్ని పూర్తిగా ఖండించారు. దానిస్థానే, ప్రతిష్టంభనను అంతమొందించడానికి వారొక సూచన చేశారు. దాని ప్రకారం, మిత్రరాజ్యాల తరఫున ఒక మధ్యవర్తిసంఘం నియమించబడాలి. ఆ సంఘం కాంగ్రెసునాయకుల్ని విడుదల చేయమని బ్రిటిష్ ప్రభుత్వానికీ, శాసనోల్లంఘనాన్ని విరమించమని కాంగ్రెసునాయకులకూ, హెచ్చరిక చేయాలి. కాని, వెంటనే ఒక భారతీయతొత్తు లేచి నిలబడి, అట్టి మధ్యవర్తిసంఘం కాంగ్రెసును సంతృప్తి పరచడానికే ఉద్దేశించబడినదని మహమ్మదీయులు వ్యతిరేకిస్తారంటూ, పుల్లపెట్టాడు. అమెరికన్ ప్రతినిధులు, కెనడా ప్రతినిధులు, తాము కాంగ్రెసు పార్టీని గుడ్డిగా బలపరచడంలేదనీ, నేటి ప్రతిష్టంభనను అంతమొందించడమే తమ ప్రధాన కర్తవ్యమనీ, ఇండియాలో భారతీయుల సహకారాన్నిపొందే మార్గం ఆలోచించడం తమ ప్రధాన బాధ్యత అనీ, తెలియజేశారు. ఈ దృక్పథాన్ని చైనా ప్రతినిధి కూడా బలపరచాడు. అయినా, ఈ సూచనకు ఒక్క భారతీయ ప్రతినిధి కూడా అంగీకారం తెలుపలేదు. ఫలితం, భారతీయ ప్రతినిధి సూచించిన అతుకులబొంతే గతి అయింది. అందులోని ముఖ్యాంశాలు యివి.

1. వైస్రాయి కార్యనిర్వాహకసంఘంలో సభ్యు లందరూ భారతీయులుగా ఉండాలి. వైస్రాయికి వీటో అధికారం ఉండవచ్చు.
2. భారతదేశంలోని వివిధపార్టీల దృక్పథాన్ని తెలియపరచగల నాయకులతో ఒక ఎక్స్‌ప్లొరేటరీసంఘాన్ని నియమించాలి. అది భారతదేశపు కొత్త రాజ్యాంగవిధానాన్ని గురించి పరిశోధనలు జరుపుతూ కాలం గడుపుతుంది.
3. ఈ ఎక్స్‌ప్లొరేటరీసంఘానికి సలహాయిచ్చేనిమిత్తం మిత్రరాజ్యాలచే ఒకఎడ్వైజరీ కమిటీ (సలహాసంఘం) నియమించబడాలి.
4. ఈవిధంగా, వివిధపార్టీల మధ్య ఏకీభావం కుదిరే ప్లాను ఒకటి తయారయాక, కొత్తరాజ్యాంగాన్ని నిర్మించే ప్రజా ప్రతినిధి పరిషత్తు ఎలాఉండాలో నిర్ణయించబడుతుంది.

కొందరు అమెరికన్ ప్రతినిధులు, యీ వైస్రాయి కార్యనిర్వాహకసంఘానికైనాబాధ్యతఅనేది ఉండాలని వాదించారు. కేంద్రశాసనసభకు ఇది బాధ్యతవహించాలని మరికొందరు సూచించారు. కనీసం, పై అతుకులబొంతను కేంద్రశాసనసభలో చర్చకు పెట్టడం మంచిదని కొందరు సూచించారు. ఈసూచనలన్నీ ఆచరణయోగ్యం కావని బ్రిటన్ ఏజంట్లుగా వెళ్ళిన భారతీయులు నిరాకరించారు.

బ్రిటిష్ ప్రభుత్వం తరఫున చర్చిల్ అట్లాంటిక్ ఛార్టర్‌ను ఇండియాకు వర్తింపజేయడం విషయంలో అనుమానాలన్నింటినీ తొలగించుచూ ఒకప్రకటన చెయ్యాలని అత్యధికసంఖ్యాకులు అభిప్రాయ మిచ్చారు. కాంగ్రెసు నాయకుల్ని విడుదలచేయడం, లేదా కనీసం వారిపై యిప్పుడున్న నిషేధాలన్నీ తొలగించడం, చాలా అవసరమని అధికసంఖ్యాకులు నొక్కి నొక్కి చెప్పారు.

అంత్యోపన్యాసాలు

గుండ్రబల్లల చర్చలు పూర్తి అయాక ప్రతినిధులందరూ తిరిగి సమావేశమయారు. మహాసభ ముగింపుకు వస్తోంది. కొందరు ప్రతినిధులిచ్చిన ముగింపు ఉపన్యాసాలు గమనించదగినవి.

ఒక బ్రిటిష్ ప్రతినిధి యిలా ఉపన్యసించాడు: "అట్లాంటిక్ ఛార్టరును ప్రపంచాని కంతకూ తు - చ తప్పకుండా వర్తింపజేయడం విషయంలో బ్రిటిష్ ప్రజలకెట్టి అనుమానంలేదు. మా బ్రిటిష్ ప్రతినిధుల మనస్సులలోకూడా ఎట్టి అనుమానంలేదు. భారతీయులకిచ్చిన వాగ్దానాన్ని ఏ బ్రిటిష్ రాజ్యాంగవేత్త అయినా భగ్నంచేయ తలపెడితే, అట్టివారు తనస్థానానికి నీళ్ళువదులుకోవలసివస్తుంది చర్చిల్ అయినా సరే, అంతే జరుగుతుంది."

ఒక కెనడా ప్రతినిధి యిలా చెప్పాడు; "బ్రిటిష్ ప్రభుత్వం, అమెరికన్ ప్రభుత్వం, కలిసి ఒక కొత్తరకమైన సామ్రాజ్యవాదాన్ని నిర్మించుకొనేటందుకు ఒడంబడిక చేసుకున్నట్లు కొందరు అనుమానపడుతున్నారు. కెనడాలో ఉన్న మేము ఇట్టి ప్రయత్నాలను సహించము. పరాధీన దేశాలకు ఎంత స్వపరిపాలన ఈయాలి? అనే విషయాన్ని నిర్ణయించ వలసినవారు ఆదేశాలపై పెత్తనం వహించేవారుకాదు. ఒక అంతర్జాతీయసంస్థ చేతిలో అట్టిబాధ్యతను విడవాలి."

ఒక అమెరికన్ ప్రతినిధి చెప్పినమాటలు: "అమెరికన్ ప్రజలు తమదేశ చరిత్రలో ఏ సూత్రంతోనైనా ఏకీభవించారంటే, ఆ సూత్రం యిది: ఏవ్యక్తి అయినా సరే స్వాతంత్ర్యాన్ని వాంఛిస్తే, ఆవ్యక్తి వెంటనే స్వతంత్రుడై తీరాలి."

మరొక బ్రిటిష్ ప్రతినిధి ఉత్సాహంతో యిలా ఉపన్యసించాడు: "భారతదేశానికి యీ రోజున సంపూర్ణ స్వాతంత్ర్యం లభించకుండా అడ్డువచ్చే చిక్కులు విడిపోయి, భారతదేశ చరిత్రలో ఒక నూతన శకం ప్రారంభమైతే, బ్రిటిష్ పార్లమెంటు సభ్యులంతా సంతోషంతో ఉప్పొంగుతారు."

గుణపాఠం

ఈ పసిఫిక్ సమావేశం వల్ల మనం నేర్చుకోవలసిన గుణ(మిగతా 8 వ పేజీలో)

యుద్ధసమీక్ష

★మరొక కొత్త సోవియట్ దాడి
★2వరంగం తెరిస్తే 1943లోనే విజయం ఖాయం

సోవియట్ వేసవి దండయాత్ర నిరాఘాటంగా ముందుకు సాగుతోంది. బ్రియాంస్కు—ఓరెల్ మధ్యనున్న కరాచెవ్‌కు నాజీరాక్షసదాస్యంతప్పింది. కరాచెవ్‌ను పట్టుకొన్నందుకు కామ్రేడ్ స్టాలిన్ హర్షిస్తూ,సందేశమిచ్చాడు. కరాచెవ్, బ్రియాంస్కుకు 28 మైళ్ళలోను, ఓరెల్‌కు 7 మైళ్ళలోను ఉంది. ! కరాచెవ్ సోవియట్ వశమవడంతో, బ్రియాంస్కులోని జర్మన్లకు ప్రమాదం హెచ్చింది. బ్రియాంస్కులోని జర్మను సేనలు అడకత్తెరలో చిక్కుకొనే ఘటన మరొకటి ఏర్పడింది. అది రెడ్ ఆర్మీ మరొక కొత్త దండయాత్రను ప్రారంభించడం. ఈ కొత్తదండయాత్ర, స్మోలెంస్కు—వ్యాజ్మా— బ్రియాంస్కు పట్టణాల త్రికోణ భాగంలో మధ్యనున్న 'స్పాస్‌దెమెన్స్కు' వద్ద ప్రారంభమైంది. ఈపట్టణానికి వాయువ్య—ఆగ్నేయభాగాల రెండింటినుండి యీదాడి ప్రారంభమయి 21 మైళ్ళ వెడల్పున శత్రురక్షణలలో గండికొట్టింది. ఆ గండి రోజు రోజుకూ విశాల మవుతోంది. ఈదాడి స్మోలెన్స్కుకు ప్రమాదం కల్గించుటేగాక, బ్రియాంస్కులోని జర్మను సైన్యాలను అడకత్తెరలో పెట్టడానికి ఉపయోగించుతుంది. ఒకవైపున దక్షిణంనుండి కరాచెవ్‌మీదుగా వస్తున్న రెడ్ ఆర్మీకి, మరొకవైపున స్పాస్‌దెమెన్స్కు నుండి వస్తున్న రెడ్‌ఆర్మీకి మధ్య బ్రియాంస్కు అడకత్తెరలో చిక్కుకోవచ్చు.

ఖార్కోవ్ రంగంలోకూడ సోవియటు దాడి ఉధృతం నానాటికి హెచ్చుతూనేవుంది. ఖార్కోవ్‌కు వాయువ్యంగాను పశ్చిమంగాను, జర్మన్లు చూపుతున్న తీవ్రప్రతిఘటనను, రెడ్‌ఆర్మీ కొట్టివేస్తోంది. ఖార్కోవ్-పోల్టావా రైల్వేలైనుకు రెడ్‌ఆర్మీ గండికొట్టింది. ఒక సేన ఖార్కోవ్‌కు ఆగ్నేయంగాను నున్న చుగెయెవ్‌ను పట్టుకొని, అటునుండి పైకి సాగుతోంది. నేడు ఖార్కోవ్ వీధులలోనే సంకులసమరం సాగుతోంది.

ఈవిధంగా జర్మన్ మూడవ దండయాత్రను ఓడించడమేగాక, ఒక్కనెలలో కొత్త కొత్త ప్రదేశాలలో రెడ్‌ఆర్మీ 350 మైళ్ళ రంగంలో ఎదురుదాడి సాగించింది. జులై 5 వ తేదీన హిట్లరు తన దండయాత్ర సాగించేటప్పుడు "ఇది యుద్ధచరిత్రలో ప్రధానఘట్టం. జర్మన్ విజయానికి ఇది అంతిమయుద్ధం" అంటూ ప్రగల్భాలు కొట్టాడు. కాని అది, జర్మను పరాజయానికి ప్రారంభదశగా మారింది.

సోవియటు విజయాలు ప్రపంచాన్నంతా దిగ్భ్రమగలిగించాయి. ఇదివరలో అనుకొన్నట్లుగాక, యుద్ధం త్వరలో ముగుస్తుంది అన్న నమ్మకం. ఉత్సాహం, ప్రపంచ ప్రజలలో వ్యాపించింది. నాజీ పాదాక్రాంత దేశాలలోని ప్రజలకు, జర్మనీలోని ప్రజలకు నాజీ వినాశనం తప్పదనే నమ్మిక హెచ్చసాగింది.

సోవియటు విజయాలు కల్గించిన అవకాశాన్ని బ్రిటిష్ అమెరికాలు ఉపయోగించుకోవాలి. గతవారం, రెండవరంగం తెరవాలని మాస్కో గావించిన హెచ్చరికను ప్రకటించాం. "వార్ అండ్ వర్కింగ్ క్లాస్" అను సోవియటు పత్రిక, దీనినే మరింత స్పష్టపరుస్తోంది. రెండవరంగం అంటే, 60 జర్మను డివిజన్లను, జర్మను బానిస దేశాల తాలూకు 20 డివిజన్లను, సోవియటు యుద్ధరంగం నుండి మార్చడం అని స్పష్టపరచింది. ఈనాడు పశ్చిమఖండంపై దండెత్తి దెబ్బతీస్తే, విజయం 1943 లోనే లభించుతుందని, మాస్కో రేడియో పదేపదే హెచ్చరించుతోంది.

ఆయా దేశాలలో జర్మనీ - దాని బానిస దేశాల - సైన్యదళాలు ఈక్రింది విధంగా పంచబడినాయి.

[illegible]

	జర్మను	ఇటలీ	బానిస దేశాలు	మొత్తం
తూర్పురంగం, రష్యా	197	—	42	239
నార్వే	10	—	—	10
ఫ్రాన్సు, బెల్జియం	31	6	—	37
ఇటలీ	—	40	—	40
బాల్కన్లు	6	34	14	54
ఇతరాలు	31	—	15	46
	275	80	71	426

సిసిలీలో కొద్ది ఇటాలియన్ డివిజన్లు, రెండు జర్మను డివిజన్లుమాత్రమే ఉన్నాయి. అందుచే దీనినే రెండవ రంగం అనడం హాస్యాస్పదం. ఇటలీలో మిత్రరాజ్యాల దాడి సంభవిస్తుం దని, ఫ్రాంసు బెల్జియమ్‌లలోని 30 డివిజన్లలో కొన్నిటిని హిట్లరు అప్పుడే ఇటలీకి పంపాడు. బాల్కన్లలోని ఇటలీ డివిజన్లకు బదులుగా, ఇతర బానిసదేశాల సైన్యాలను పెడుతున్నాడు. ఈపరిస్థితుల ఫలితంగా హిట్లరు రిజర్వు సైన్యాలకే ఒత్తిడి ప్రారంభమయింది.

ఇది గుర్తించి మిత్రరాజ్యాలు ఫ్రాంసు, బెల్జియమ్‌లపై ఇటలీపై ఒకేసారి పడాలి. అప్పుడేజర్మనీ గుండెకుసూటిగా దెబ్బతగులుతుంది. మిత్రరాజ్యాలు కొట్టే దెబ్బకు సహాయంగా, ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ఫ్రాంసులో బలమయిన ఫాసిస్టు ప్రతికూల శక్తులున్నాయి. ఇటలీలోకంటె కూడ బలంగా ఉన్నాయి. అందుచే ఫ్రాంసు ఇటలీలపై దండయాత్ర, హిట్లరును త్వరలో కూల్చివేయగలవు.

హిట్లరు అపజయాలు, హిట్లరు బానిస దేశాల నాయకులలో కలవరం, ప్రజలలో తిరుగుబాటును హెచ్చిస్తున్నాయి. పారిస్‌లో జర్మన్ సైనికులపై ఫ్రెంచి ప్రజలు తిరుగుబాటుచేశారు. స్వీడన్, జర్మన్ సైన్యాలను తనదేశంలోగుండా పోనిచ్చే ఒడంబడికను రద్దుచేసుకొంది. ఫిన్లండు యుద్ధంలోనుండి బయటపడటానికి ఆలోచిస్తోంది.బల్గేరియాలో విప్లవపరిస్థితులున్నట్లు మరొకవార్త.

ఇట్టి పరిస్థితులమధ్య సిసిలీలో మిత్రరాజ్యాలపురోగమనం నిర్విఘ్నంగా సాగుతోంది. రెండోజా మిత్రసేనల వశమయింది. జర్మన్లు సిసిలీనుండి నిష్క్రమించుతున్నారు. మిత్రరాజ్య యుద్ధనౌకలు, విమానాలు మెస్సీనాముఖద్వారం వద్ద ప్రచండంగా దాడులు సల్పి, జర్మన్లకు నష్టం కల్గించుతున్నాయి.

ఇంతేగాక, జర్మనీ ముఖ్యపట్టణాలపైన, ఆస్ట్రియాలో వియన్నాపైన, ఉత్తర ఇటలీ పట్టణాలపైన ప్రచండ విమానదాడులు సాగుతూనే ఉన్నాయి.

ఇటలీలోకి మరికొన్ని సైనికదళాలను రప్పించి తనగుప్పిటను మరింత బిగించుచున్న హిట్లరుకు వ్యతిరేకంగా, ఇటలీ ప్రజా ఉద్యమం విజృంభించుతోంది. హిట్లరుకు లొంగుతున్న బడోగ్లియోకు వ్యతిరేకంగా కూడ ఉద్యమం ప్రబలుతోంది. ఇటాలియన్ న్యూస్ ఏజన్సియే ఇలా అంగీకరించింది. "20 ఏండ్లనిర్బంధానంతరం ఇటలీ ప్రజలు శాంతిని కోరడంలో ఆశ్చర్యంలేదు. శాంతి అంటే, యుద్ధత్యాగాలకు, యుద్ధ భీభత్సాలకు స్వస్తిఅని వారికి తెలుసు" "బడోగ్లియో ముస్సోలినీ లేకుండా ముస్సోలినీ విధానం సాగించు తున్నాడనీ, యావన్మంది ప్రజలూ కలిసిరాజకీయ తిరుగుబాటు తెచ్చినపుడే ఇటలీలో ఫాసిజం అంతమవుతుందిఅనీ," సోవియటు పత్రిక "వార్‌అండ్ వర్కింగ్‌క్లాసు" హెచ్చరించింది. ఈ ప్రజాఉద్యమానికి, పైన చెప్పిన మిత్రరాజ్యాలు కొట్టేదెబ్బలుసహాయపడతాయి.

కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య

అక్షరాజ్యాలను జయించాలంటే, మిత్రరాజ్యాలమధ్య ఒకే విధమైన ప్లానుండాలి. ఇప్పుడు రూజ్‌వెల్టు - చర్చిల్ సంభాషణలు జరుగుచున్నాయి. ఇందులో కెనడా, చైనాలు కూడా పాల్గొనుచున్నాయి. ఈడెన్‌కూడా అందుకే కెనడా చేరాడు.

కాని ఈ సమావేశానికి స్టాలిన్‌ను ఆహ్వానించకపోవడం, జర్మన్ దుష్ప్రచారానికి అవకాశం ఈయడమే అవుతుంది. దూరదృష్టి గలవారందరూ సోవియటును ఆహ్వానించాలనే కోరుతున్నారు. స్టాలిన్‌ను ఆహ్వానించనందుకు, గాభరాపడుతూ అనేక పత్రికలు, వ్యాసాలు వ్రాశాయి. లండన్ టైమ్సు, "ప్రతి చర్చలోను, నిర్ణయాలలోను రష్యాకు భాగం ఉండాలి" అని కోరింది. న్యూయార్కు టైమ్సుకూడా ఇలాగేకోరింది. హెరాల్డు ట్రిబ్యూన్ "ఈసమావేశం నచ్చడంలేదు", అని అంది. డైలీహెరాల్డు మిత్రరాజ్యాల "రాజకీయసమితి" ఏర్పడాలనీ, స్టాలిన్‌ను ఆహ్వానించి యుండవలసిందనీ కోరింది. "స్టాండర్డు" ఇలా వ్రాసింది. "ముఖ్యమైన యుద్ధ భారం ఇంకా స్టాలినే వహించుతున్నాడు. ఈ సమావేశంలో స్టాలిన్ లేకపోవడం విషాదకరం"

రూజ్‌వెల్టు - చర్చిల్ సంభాషణలు యూరప్‌ఖండంలో రెండవరంగానికి దారి తీయాలని ప్రపంచమంతా ఎదురుచూస్తూంది.

16—8—43

(2 వ పేజీ తరువాయి) పలుకుబడి సంపాదించు కుందామనే అభిప్రాయంతో సభలలో అల్లరిచేశారు. తెనాలిలో జరిగిన బహిరంగ సభను పోలీసులకు వొప్పజెప్పి, తాము బ్రిటిషు ప్రభుత్వాన్ని పడగొట్టబోతున్నామంటే, యెవరునమ్ముతారు? గూడూరు సభలో ఉపన్యాసకునిమీద చెప్పులువిసిరినంత మాత్రంచేత ప్రజాదరం లభించిందా? పదమటలో జరిగిన బహిరంగసభలో గల్లంతు చేసినందుకు గ్రామస్థులంతా చీవాట్లుపెట్టారు. ఈదుప్పగల్లులో ఎర్రజండాను రహస్యంగా ఎత్తుకుపోయిన "పోరాట" వాదులచర్యను ఈదుప్పగల్లు ప్రజలు ఖండించారు.

ముసుగును తొలగించారు

పంచమాంగదళం వేసుకున్న దేశభక్తి ముసుగు ఆగస్టు 9 వ తేదీన పూర్తిగా తొలగిపోవడానికి దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, సరోజినీనాయుడు, హన్సరాజ్, శ్రీవాస్తవ, డాక్టరు కిచ్లూ, నరహరిపరేఖ్, నాగేంద్రనాథసేన్, గారలవంటి సుప్రసిద్ధ కాంగ్రెసు నాయకుల ప్రకటనలు కూడా చాల వరకు తోడ్పడ్డాయి.

ఈవిధంగా కాంగ్రెసు పేరిట పన్నెండు సంవత్సరంనుండి మోసపుచ్చు తూన్న కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డ్‌బ్లాకు,రంగా గ్రూపు ప్రజలయెదుట పూర్తిగాబట్టబయలు చేయబడ్డారు.

దేశభక్తులకు హెచ్చరిక

వీరికీ — కమ్యూనిస్టులకూ మధ్య నేడు జరుగుతూన్న పోరాటం రెండుమతాల మధ్య పోటీకాదనీ, ఫాసిస్టుదాస్యానికీ, భారతస్వాతంత్ర్యానికీ మధ్య జరిగే పోరాటం అనీ, కాంగ్రెసు దేశభక్తులు తెలుసుకోవలసియుంది. వీరికి ప్రజలలో యికముందు కూడా యెట్టి స్థానంలేకుండా చేయవలసి యుంది. ఆగస్టు 9 ని వీరి కుట్రలన్నీ విఫలం కావడంవల్ల నిరంకుశాధికారులు కూడా ప్రజల్ని రెచ్చగొట్టలేకపోయారు. ఇది మన జాతీయోద్యమానికి, వివిధపార్టీల మధ్య ఐక్యతకు ఎంతైనా సహాయం చేస్తుంది. మరొక అడుగు ముందుకువేసి, ముస్లిం దేశభక్తుల సహకారంతో జాతీయైక్యతను నిర్మించడమే కాంగ్రెసు దేశభక్తుల తక్షణ కర్తవ్యం. ఇందుకు ముస్లింజాతుల ప్రజలు వాంఛించే స్వయంనిర్ణయ హక్కును గుర్తించాలి. కాంగ్రెసు నాయకత్వం క్రింద జరిగిన స్వాతంత్ర్య పోరాటాలన్నింట్లోను సరిహద్దు రాష్ట్ర ప్రజలు విరివిగా పాల్గొన్నారు. వీరిలో 100 కి 90 మందికిపైగా మహమ్మదీయులు. అట్టి సరిహద్దు రాష్ట్రంలో నేడు పాకిస్థాన్ నినాదంపై ముస్లింలీగ్‌కూ, కాంగ్రెసుకూ మధ్య 4 ఎసంబ్లీసీట్లను వచ్చిన పోటీలో అన్నిసీట్లు ముస్లింలీగ్ అభ్యర్థులకే వచ్చాయంటే, కాంగ్రెసు పలుకుబడిలోవున్న ముస్లిం ప్రజాసామాన్యం సహితం స్వయం నిర్ణయ హక్కును ఎంతగా వాంఛిస్తున్నారో ఊహించుకోవచ్చు. కాంగ్రెసు దేశభక్తులకు ఈ ఎన్నిక ఒక గుణపాఠం. ముస్లిం జాతుల దేశభక్తికీ, వారు కోరే స్వయం నిర్ణయ హక్కుకూ, ఎంతదగ్గర సంబంధం ఉందో గ్రహించి, యిప్పుడైనా వారి వాంఛను బలపర్చాలి. ఇటు ముస్లింలీగ్‌కూడా 9 వ తేదీని కాంగ్రెసు దేశభక్తులుగాని, వారిని బలపరచే ప్రజాసామాన్యంగాని, విధ్వంసక చర్యలలో పాల్గొనకపోవడాన్ని గుర్తించి, కాంగ్రెసు నాయకుల విడుదలకై ఆందోళన ప్రారంభించవలసి యుంది. 16—8—1943

సవరణ

4 వ పేజీలో, మహిళాలోకం వార్తలో 6—7—43 కి బదులు 6—8—43 అని చదవాలి.

అధికాహారోత్పత్తికి అవకాశాలు; ఆటంకాలు

లింగగిరి పరగణా కృష్ణాజిల్లాలో జగ్గయ్యపేటకు సుమారు 20 మైళ్ళ దూరంలో ఉంది. చుట్టూ నైజాం సంస్థానం. మొత్తం 12 గ్రామాలలో సుమారు 10 వేలమంది ప్రజలు నివసిస్తున్నారు. పరగణాను 23 రు జమీందార్లు 72 భాగాలుగా పంచుకున్నారు. మామూలురోజుల్లోనే యీప్రాంతంలో కరువులు తరచుగా వస్తూఉండేవి. ఇప్పుడు చాలా మంది బీదలు తిండికి మొగంవాచి, కూలి — నాలి చేసుకోడానికి యితరగ్రామాలకు వెళ్ళిపోయారు. ఇది మెట్టప్రాంతం అగుటవల్ల చెరువులకిందా,బావులకిందా,కుంటలకిందా,మాత్రం కొద్దిఎకరాల మాగాణి సాగుచేస్తున్నారు. నీటి సప్లయిఉంటే, సంవత్సరానికి రెండుపంటలు. కొన్నిచోట్ల మూడుపంటలు, కూడా పండించవచ్చు. కాని, చెరువులు మరమ్మతు లేకపూడిపోయాయి. కొన్నిపూడిపోతున్నాయి. వీటిని బాగుచేయిస్తే,2 వేల ఎకరాల బంజరుభూమిని సాగుచేయవచ్చు. జమీందార్లకు భాగాలు కుదరక, లింగగిరిలో ఉన్న ఒక పెద్దచెరువుకు గండికొట్టి,నీళ్ళు నిలవకుండాచేసి.దాంట్లోమెట్ట పైరులు సాగుచేస్తున్నారు అంతకుముందు మాగాణిపంటలు పండించుకొంటున్న 250ఎకరాల భూమి ఇందువల్ల బంజరుగా ఉండిపోయింది.ఇదేవిధంగావేములేరు అనేవాగుక్రింద కట్టబడిన ఆనకట్టను సరిచేస్తే, సుమారు 200 ఎకరాలు సాగుఅవుతుంది. కాని, జమీందార్లు ఈ మరమ్మతులకు పూనుకోవడం లేదు. కొద్దో గొప్పో అవకాశాలున్నచోట్ల తమ సొంతభూముల్ని మాత్రం సాగుచేసుకొంటున్నారు. ఈవిధానంవల్ల ఆహారపదార్థాల సంక్షోభం ప్రజల్ని పిల్చిపిప్పిచేస్తూంది. బియ్యం రూపాయకు 3 తవ్వలు మాత్రమే యిస్తున్నారు. కిరసనాయిలు కాయ ఖరీదు 10 అణాలు, ముప్పావలా. పంచదార వీశె 1-8-0. వీటికితోడు, చుట్టూ నైజాంసంస్థానం ఉండడంవల్ల "శాయిరీ" కట్టుకోలేక అవస్థపడుతున్నారు. ప్రజల్ని యీదుస్థితినుండి కాపాడాలంటే, చెరువులను జమీందార్లు మరమ్మతు చేయించాలి; బంజరుభూమిని సాగుకు యివ్వాలి; కో-ఆపరేటివ్‌సొసైటీలు, స్టోర్సు తెరువబడాలి; కిరసనాయిలు చౌకగా అమ్మించాలి; "శాయిరీ" యిబ్బందిని తొలగించాలి.

—కాట్రగడ్డ రాజగోపాలరావు

(కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యదర్శి)

రెవెన్యూ అధికార్ల వింతపోకడ

ఏలూరు తాలూకా, పోతునూరుగ్రామంలో గత సంవత్సరం పేదరైతులు, వ్యవసాయ కూలీలు కలిసి కొంతబంజరు భూమిని సాగుచేశారు. ఆసందర్భంలో రెవెన్యూ అధికార్లు వారిపై పెనాల్టీలు విధించి, వచ్చే సంవత్సరం సాగుచేసుకోవచ్చునని చెప్పారు. ఈయేడు పేదరైతులు - కూలీలు తిరిగి అర్జీలు పెట్టుకొని, భూమిని దున్ని కొంతవరకు ఊడ్చారు. ఇంతలో పిడుగువంటి వార్తవచ్చింది. తహసిల్దారు 21 యకరాల భూమిని 7 గురు దఫేదార్లకు యిచ్చాడు. గత సంవత్సరం పెనాల్టీలు చెల్లించుకొని, ఈయేడు సగం వ్యవసాయం పూర్తిచేసిన గ్రామస్తుల్ని విడిచిపెట్టి వ్యవసాయంలో ఎట్టి అనుభవంలేని దఫేదార్లకు భూమిని యివ్వడం అధికోత్పత్తిని యెలా ప్రోత్సహించడమో ఆ తహసీల్దారుకే తెలియాలి!

సిద్ధాన్నం మట్టిలో కలిసింది

తూర్పుగోదావరిజిల్లా, రాజోలు డివిజన్, కడలిగ్రామంలో గోగి నరసింహమూర్తి అనే ఒక పేదకూలీ 50 సెంట్లు భూమికి దరఖాస్తు పెట్టి, ఊడ్చాడు. 6 వారాలయింది.8-8-43వ తేదీని గ్రామమునసబు తన అల్లునిచే ఆ చేలోకి పశువుల్ని తోలించి, పంటను నాశనం చేయించాడు. ఈ విధంగా సిద్ధాన్నం మట్టిలో గలిసింది. పంటల అధికోత్పత్తిని నిరోధించే వ్యక్తులపై ప్రభుత్వాధికారులు తగిన చర్య తీసుకోవలసియుంది.

పశ్చిమ గోదావరి జిల్లాలో ఇరిగేషన్ స్కీములు

ప. గోదావరిజిల్లా రైతుసంఘం తరపున పేటేటి వెంకటరత్నంగారు (అధ్యక్షులు), కృత్తివెంటి వెంకటేశ్వరరావుగారు (కార్యదర్శి) యిలా ప్రకటిస్తున్నారు:

ఈ జిల్లాలో, కానూరు, ఉసులుమర్రు, నడుపల్లె, కానూరు అగ్రహారం, కోడుపల్లి, మునిపల్లి, గ్రామాలభూములకు మురుగు సౌకర్యాలులేక, కొన్నివేల యకరముల భూమికి నష్టంవాటిల్లుతోంది. విఘ్నేశ్వరం నుండి రెండుకాల్వలు తవ్వుటద్వారా అట్టి నష్టంరాదని యిదివరలో రైతులు రెవెన్యూ మెంబరుకు సూచించియున్నారు. ప్రభుత్వం 4 సంవత్సరాల క్రితమే స్కీములను గురించి ప్లానులు తీసుకొంది. కాని, ఆస్కీములను అమలులో పెట్టడానికి ప్రయత్నించియుండలేదు. ఇప్పుడు కానూరుస్కీము శాంక్షను అయినట్లు తెలుస్తోంది. కనీసం ఆస్కీమునైనా వెంటనే అమలులో పెట్టుట ద్వారా భూములకు నష్టం కలుగకుండా చేయవచ్చు. అంతేగాక, పురుషోత్తంపల్లి, ద్రోణంరాజు ముప్పవరం, కలవచర్ల, పందలపర్రు, గ్రామాలలో భూములు కొన్నివేలయకరాలు సాగుకు వస్తాయి.

ఏలూరు తాలూకాలోని దెందులూరు స్కీమునుకూడా ప్రభుత్వం శాంక్షను చేసినట్లు ప్రకటించబడింది. దీనివల్ల 1400 యకరములు సాగుఅగుట కవకాశంఉంది. కాబట్టి, దేశంలో ఏర్పడిన ఆహారపదార్థాల కొరతను కొంతవరకైనా తీర్చుటకు పైస్కీములను వెంటనే అమలు జరపవలసియుంది.

(6 వ పేజీ తరువాయి) పాఠం ఏమిటి?

ప్రపంచప్రజలు మన దేశంలో నేడేర్పడిన రాజకీయ ప్రతిష్టంభనను అంతం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడ ఫాసిజానికి విజయం లభించినా, తమ స్వాతంత్ర్య పోరాటం ఒక అడుగు వెనక్కు వెళ్తుందని వారు గుర్తించుతున్నారు. మన దేశంనుండి వెళ్ళిన కీలుబొమ్మలు బ్రిటిషు సామ్రాజ్యవాదులు కోరినట్లల్లా నృత్యం చేశారు. సామ్రాజ్యవాదులు చెప్పే మామూలు సాకులే వీరు క్విబెక్ సమావేశంలో ఏకరువు పెట్టారు. వారి బూటకపు వాదనకు ఇండియాలో వివిధరాజకీయ పార్టీలు, ముఖ్యంగా ముస్లింలీగు, కాంగ్రెసు, తగిన జవాబు చెప్పవలసి యుంది. ఈ రెండు జాతీయసంస్థలమధ్య ఒడంబడిక ఎంత అవసరమో పసిఫిక్ సమావేశం కండ్లకు కట్టినట్లు తెలియజేసింది. మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రపంచ ప్రజల సహకారం ఎంత ఎక్కువగా వుందో స్పష్టం చేసింది.

సోమవరప్పాడు రైతుల చొరవ

పశ్చిమ గోదావరిజిల్లాలో తణుకు తాలూకాకు చెందిన సోమవరప్పాడు జమీందారీ గ్రామం. చెరువులు, కాలవలు, మరమ్మతులులేక 3 సంవత్సరాలనుండి వరుసగా పంటలులేవు. జమీందారును ఎన్నివిధాలప్రార్థించినా ప్రయోజనంలేక పోయింది. ఈయేడు రైతులొక చెరువులో పాతనీటిని నిల్వ ఉంచుకోవాలనే ఉద్దేశంతో నీటినిఆపుచేశారు. ఇది జమీందారుకు యేవిధంగాను నష్టంకలిగించదు. అయినా, రైతులు నిల్వచేసుకున్న పాతనీటిని ఆకతాయి తీసివేయించాడు.

కాని, ప్రజల్ని ఆహారసంక్షోభం నుండి రక్షించేనిమిత్తం అధికోత్పత్తి తమసొంతబాధ్యతగా రైతులు గుర్తించారు. వెంటనే రైతుయువకులుచొరవ తీసుకొని, గ్రామంలో చందాలు వసూలుచేసి, సకాలంలో ఏటికాలువను బాగుచేయించుకున్నారు. ఈకృషివల్లచెరువుకు నీరువచ్చి, 5000బస్తాల ధాన్యం పంటకు అవకాశం లభించింది

కరువుప్రాంతాలలో ప్రజల దుర్భర పరిస్థితులు

అనంతపురంజిల్లా, పత్తికొండతాలూకాలో 7 కరువునివారణ క్యాంపులున్నాయి. వాటిలో సుమారు 34,000 మంది పనిచేస్తున్నారు. అధికార్లు వారికి కూలిడబ్బులు యిస్తారేగాని, గింజలు కొనుక్కునే స్థలంచూపరు. క్యాంపు స్టోర్సులో ఎక్కడచూచినా అమ్ముటకు గింజలు దొరకడంలేదు. భోజనశాలలకు మాత్రం ఒక్కొక్క స్టోరులో 100 బస్తాల సరుకు స్టాకుచేయవలసిందని ఉత్తరువు లిచ్చారు. ప్రతి స్టోరులోను అమ్మటకు గింజలు అయిపోయి వారంరోజులైంది. (7-8-43 నాటికి). చాలామంది కూలీలు బురుగులు (మరమరాలు), అనుములు (చిక్కుడుగింజలవంటివి) తిని, పనిలో ప్రవేశిస్తున్నారు. అవి కూడా శేరు 0—3—0, 0—6—6 కు అమ్ముతున్నారు. ఈతిండితో కళ్ళు తిరిగి, పనిచేసే స్థలంలోనే పడిపోవడం జరుగుతోంది. ఇందువల్ల వారికి రావలసినకూలిడబ్బులుపూర్తిగా రావడంలేదు.

చుట్టుప్రక్కగ్రామాలకుపోయి, జొన్నలు శేరు 0—7—0 చొప్పున, కొర్రలు 0—4—6 చొప్పున తెచ్చుకొని కొందరు పల్చని గంజి కాచుకొని తాగుతున్నారు. ఇదివరలో గింజలు స్టోరులో దొరకనప్పుడు చిల్లర వ్యాపారస్థులు ఎక్కువ ధరకయినా అమ్ముతూ ఉండేవారు. కాని, ఇప్పుడు స్టాకులే లేకుండాపోయాయని జవాబు చెబుతున్నారు. నేను వెళ్ళిన ప్రతిచోట వంటశాలలకు స్టాకుచేసిన గింజలను లూటీచేస్తామని, రైతుల యిండ్లమీద పడి దోచుకుంటామని,కూలీలు ఉద్రేకంతో చెప్పేవారు. అట్టి చర్యలనుండి కూలీలను కష్టంమీద తప్పించాను. కాని, కరువుక్యాంపులలో నానాటికి విషమించుతూన్న దుర్భర పరిస్థితిని తొలగించడానికి ప్రభుత్వం తగినన్ని గింజలను స్టోర్సులో నిలవచేయడం అత్యవసరం.

— ఎస్. కుప్పుస్వామి

* * *

పల్నాడు తాలూకాలో క్షామ పరిస్థితులు

పల్నాడు తాలూకా, పుల్లారెడ్డిగూడెం ప్రాంతాలలో చెంచువారు, లంబాడీలు, తిండిలేక ఆకులు తిని జీవిస్తున్నారు. ఇందువల్ల కొందరికి జబ్బులుచేసి, చనిపోతున్నారు. అగ్గిపెట్టెలు, కిరసనాయిలు, దొరక్క, పెద్ద పెద్ద మొద్దులను తగులవేసి, ఆవెలుతురులో అన్నం తింటున్నారు. దాచేపల్లి ఫిర్కాకు చెందిన మాదినపాడు, దాచేపల్లి, గ్రామాలలో 3 నెలలలో 500 పశువులు చీడతగిలి చనిపోయాయి. దాచేపల్లిలో యీనాటికికూడా చనిపోతున్నాయి. మాచర్ల చుట్టుప్రక్కల కలరావ్యాపించింది. తేరాల, నిరిగిరిపాడు, గంగిరెడ్డిపాలెం గ్రామాలలో కలరా అధికంగా ఉంది.

ప్రభుత్వం వెంటనే కరువు నివారణపనులకు పూనుకోవాలి. కలరాను అరికట్టడానికి తగిన ఏర్పాటులు చేయాలి. వ్యవసాయానికి పనికివచ్చే చెరువులు బాగుచేయించాలి. వాడపల్లి, నాగులేరు, దయిద, చంద్రవంక ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకుంటే, బీదలకు పనులు దొరకడమేకాకుండా, యికముందు కరువు రాకుండా చేయవచ్చు. ధాన్యంలేని ప్రదేశాలకు ధాన్యం తెప్పించి చౌకడిపోలలో అమ్మించాలి. కొన్నిచోట్ల బీదలకు ఉచితంగా ధాన్యం యివ్వాలి.

— కోలా నైదులురెడ్డి

ఏజంట్లు

1. ప్రతినెలా మొదటివారంలోగా, క్రిందటి నెల బిల్లు పూర్తిగా చెల్లించకపోతే పత్రిక పంపబడదు.

2. పత్రికలు ఎక్కువ కావలసివచ్చినా, తగ్గించవలసి వచ్చినా ఒక వారం రోజులు ముందుగా తెలియజేయాలి. లేనిచో మార్పు చేయడం అసంభవం.

చందాదార్లకు

1. అడ్రసులు స్పష్టంగా వ్రాయాలి.

2. అడ్రసులు మార్చేయెడల, చందానెంబరు, పాతఅడ్రసు, కొత్తఅడ్రసు వివరంగా వ్రాయాలి.

3. పాత చందాదార్లు చందాలను తిరిగి కట్టేటప్పుడు తమ చందా నెంబరు తెలియజేయాలి. లేదా కనీసం తాము ఇదివరలో చందాదారుగా వున్నామనే సంగతివ్రాయాలి.

4. ఏవారమైనా పత్రికఅందనిచో వెంటనే తెలియజేయాలి. రెండుమూడు వారాలో, నెలరోజులో పోయినతరువాత మాకు ఇన్నిరోజుల నుంచి అందడంలేదని వ్రాస్తే పొరపాటు ఎక్కడవున్నదీ తెలుసుకోవడం కష్టం. కంప్లెయింటు వ్రాసేటప్పుడు చందానెంబరు, అడ్రసు వివరంగా వ్రాయాలి.

అడ్రసు మీదనున్న చందాఅయిపోయే తేదీనిచూచుకొని, ఆ తేదీలోపలే మరల చందాలుకట్ట ప్రార్థన.

—మేనేజరు.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE